# కల్వరి ప్రేమధార

(ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక)



క్రీస్తునందు నిలిచియుండునట్లుగా మమ్మును
స్థిరపరచి అభిషేకించినవాడు దేవుడే - 2 కొరింథీయులకు 1:21

జూలై - ఆగష్టు 19

విడి ప్రతి వెల రూ. ౨౦/-

ఎడిటర్:
డా: యన్. జయపాల్



# అభిషేకము

దేవుడు ముందుగానే అభిషేకించినవారిని గుర్తించి; దేవుని సేవ పట్ల వారికున్న ఆసక్తిని, దేవుని సేవలో వారు వాడబడుతున్న విధానాన్ని గ్రహించి; వారిని బహిరంగముగా అభిషేకించటమే 'అభిషేకం' అని కీ.శే. రెవ. ఆరార్కే మూర్తి గారు అన్నారు!

ఎవరో ఒక దైవజనుడు నూనెతో నిన్ను అభిషేకించటమే అభిషేకం కాదు గాని పరిశుద్ధాత్ముడు మన మీద క్రీస్తు సారూప్యాన్ని కుమ్మరించటమే 'అభిషేకం'. అభిషేకాన్ని పరము నుండి మనము దింపలేము గాని; మనల్ని మనం సిద్ధపరచు కొనుట ద్వారా, ఆయన అభిషేకం కొరకు కనిపెట్టుట ద్వారా అభిషేకించబడతాము! యేసుప్రభువు యొర్దాను నది నీళ్ళలో నుండి బయటికి వచ్చినప్పుడు, పావురము రూపంలో దిగివచ్చిన పరిశుద్ధాత్మ చేత అభిషేకించబడెను (లూకా 3:21,22). ఆది సంఘములో మేడగదిలో ప్రభువు సన్నిధిలో ప్రార్థనలో కనిపెడుతున్నప్పుడు విభజించబడిన అగ్ని నాలుకల వలె పరిశుద్ధాత్ముడు దిగివచ్చెను (అపో. కార్య. 1:12-2:4).

అనేకమంది దైవజనులు రక్షణ అనుభవాన్ని ఎలా వ్యక్తిగతంగా పొందారో, అలాగే పరిశుద్ధాత్మ అభిషేకాన్ని అనుభవించారు! అభిషేకం కొన్ని యోగ్యతలను బట్టియో, కోరినదాని బట్టియో, అధికారం కొరకో ఇచ్చేది కాదు గాని; ఆనాడు ప్రవక్తలను తాను కోరుకొన్నవారిని అభిషేకించమని ప్రభువు చెప్పినట్లు; నేడు ప్రభువు కోరుకొన్నవారిని గుర్తించి, అభిషేకించాలి!

పాత నిబంధన కాలంలో యాజకునిగా, రాజుగా, నాయకునిగా, ప్రవక్తగా ఉండుట కొరకు ప్రత్యేకించబడినవారిని దేవుడు అభిషేకించెను. అయితే ఈనాడు రక్షించబడిన వారందరూ రాజులైన యాజక సమూహములో చేరుతున్నారు గనుక ప్రతి ఒక్కరూ అభిషేకించబడి, వివిధ వరములను పొంది, దేవుని రాజ్యాభివృద్ధి కొరకు ప్రయాసపడువారిగా ఉండాలని ప్రభువు కోరుకొంటున్నాడు. మొదట రక్షణ అనుభవం పొందాలి; తరువాత అభిషేకించబడి ఆయన సాక్షులుగా, ఆయన పరిచర్యలో సాగాలి అన్న విషయాన్ని గుర్తిద్దాం!

– యన్. జయపాల్


**'కల్వరి దర్శనం' టి.వి. పరిచర్యలకు మీరెప్పుడైనా విరాళము పంపారా?**
**ఆధ్యాత్మికముగా మీరు ఈ పరిచర్యల ద్వారా బలపడుతుంటే,**
**ఆర్థికంగా సహకరించండి!**
వివరములకు ఇప్పుడే కాల్ చేయండి! – **(0) 89 39 39 39 39**

# కల్వరి ప్రేమధార

ఎడిటర్: యన్.జయపాల్ జూలై-ఆగస్టు 2019

కల్వరి 35 {ఈ పత్రిక ఉచితం కాదు, కనీస వార్షిక విరాళము రూ.120/-; ప్యాకింగ్ & పోస్టేజి రూ.30/- అదనం!} ధార 4


## ముఖాముఖి

ప్రభువునందు ప్రియులైన 'కల్వరి ప్రేమధార' పాఠకులకు, శ్రేయోభిలాషులకు క్రీస్తు నామమున శుభమని చెప్పి వ్రాయుట!

ప్రపంచంలో మరియు మన దేశంలో కలుగుచున్న రాజకీయ మార్పులను, వాతావరణ మార్పులను, నీతి న్యాయములు దిగజారుతున్న విషయములను మనము గమనించినప్పుడు క్రీస్తు కొరకు పరిశుద్ధము గాను, యథార్థము గాను జీవించటం కష్టతరంగా అనిపించుచున్నది. ఒకవైపు క్రైస్తవులనబడిన వారి వలన క్రీస్తు నామమునకు అవమానము కలుగుచుండగా, మరోవైపు నిజ క్రైస్తవులుగా ఉండగోరుచున్న వారికి శ్రమలు కలుగుట చూస్తున్నాం!

అయితే మనము శ్రమల గుండా వెళ్ళుచున్నప్పుడు పరిశుద్ధపరచబడుతున్నామని, విశ్వాసాభివృద్ధి పొందుచున్నామని, శ్రమలలో మనము దేవుని అద్భుతములను చూడగలమని గ్రహించిన యెడల శ్రమలయందు మనము అతిశయించుదుము! "లోకములో మీకు శ్రమ కలుగును; అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించియున్నాను" (యోహాను 16:33) అని ప్రభువు చెప్పెను.

'కల్వరి దర్శనం' టి.వి. కార్యక్రమాలు మీరు వీక్షిస్తున్నారా? ఇతరులకు పరిచయం చేస్తున్నారా? మీరందరూ ఆధ్యాత్మికంగా బలపడి, ప్రభువు రాకకు సిద్ధపడునట్లు ఈ వర్తమానములు మీకు అందిస్తున్నాం!

అలాగే 'కల్వరి ప్రేమధార' మీరు చదివి మేలు పొందుచున్నారా? ఈ పత్రికను మీ బంధువులకు, స్నేహితులకు పరిచయం చేయాలని కోరుచున్నాము! కల్వరి ప్రేమధార సాఫ్ట్ కాపీ కూడా పొందవచ్చు!

ఇప్పుడు సోషల్ మీడియా ద్వారా కూడా మీకు దేవుని వాక్యాన్ని, లైవ్ ఆరాధనను అందిస్తున్నాము! Dr.Jayapaul YouTube ఛానల్ ఇంతవరకు మీరు Subscribe చేయకపోతే, ఈ రోజే Subscribe చేయండి! మీ వార్షిక విరాళం పంపి, పత్రికాభివృద్ధికి తోడ్పడండి!

- ఎడిటర్


Vol-XXII ISS-IV

Jul-Aug 2019 R.N.I. No.69868/98


## ఈ సంచికలో....


★ సూర్య చంద్ర నక్షత్రములు
★ ఏర్పరచబడినావా? - జాగ్రత్తపడు!
★ జంతువులు - నేర్పు పాఠములు
★ పరిశుద్ధ గ్రంథము
★ మన ప్రార్థన - దేవుని జవాబు
★ యెహోషువ గ్రంథము
★ వాల్టెమార్ హాఫ్కిన్ మీకు తెలుసా?
★ పరిశుద్ధాత్మ ద్వారా కుమ్మరించే ప్రేమ
★ ప్రభువా! నాకు నేర్పుము
★ బలిష్ఠుడైన క్రీస్తు
★ మంచి మనస్సాక్షి కలిగియుండుట
★ నోరు జారితే...
★ ఇదీ నేటి క్రైస్తవ్యం!
★ సమస్యలు జయించుట ఎలా?
★ పాప క్షమాపణ పొందగోరువారికి...
★ ఇరుకు మార్గము - విశాల మార్గము
★ కృపగల స్త్రీ
★ అర్థాలు తెలుసుకొందాం!
★ మీరు బైబిలు చదువుచున్నారా?
ఇంకా...ఇంకా...ఎన్నెన్నో....



*Our Only Address:*

**JAYAPAUL FOUNDATIONS**
**29, NEW COLONY ROAD,**
**VELACHERY,**
**CHENNAI-600 042.**

Phone : 044-2243 4787
Cell : (0) 98847 07779,
(0) 89 39 39 39 39
E-mail : Enquiry@jayapaul.com
Website : www.jayapaul.org

# సూర్య చంద్ర నక్షత్రములు

సూర్య చంద్ర నక్షత్రములు ఆకాశమునకు చెందినవి. అవి దేవునిచే సృజించ బడినవి. ఆయన పగటి నేలుటకు సూర్యుని చేసెను, రాత్రి నేలుటకు చంద్ర నక్షత్రములను చేసెను (కీర్తన 136:8,9). ఇవి దేవుని మహిమను వివరించునవి (కీర్తన 19:1); దేవుని స్తుతించవలసినవి (కీర్తన 148:3). అయితే "సూర్యుని మహిమ వేరు, చంద్రుని మహిమ వేరు, నక్షత్రముల మహిమ వేరు. మహిమను బట్టి యొక నక్షత్రమునకును మరియొక నక్షత్రమునకును భేదము కలదు గదా" (I కొరింథీ 15:41).

పరిశుద్ధ గ్రంథములో ఉన్న ప్రతి విషయము అనేక ఆధ్యాత్మిక సత్యములను నేర్పించుచున్నవి. ఆకాశములో ఒక అందమైన కుటుంబముగా ఉన్న సూర్య చంద్ర నక్షత్రములు భూమి మీద ఉండవలసిన మన కుటుంబముల స్థితిని గుర్తు చేయుచున్నవి. సూర్యుని తండ్రిగాను, చంద్రుని తల్లిగాను, నక్షత్రములను బిడ్డలుగాను మనం చూస్తే చక్కని కుటుంబం కనబడుతుంది. యోసేపు కల కనినపుడు అందులో సూర్యచంద్రులు, పదకొండు నక్షత్రములు నాకు సాష్టాంగపడెనని చెప్పెను. అందుకతని తండ్రి నేనును, నీ తల్లియు, నీ సహోదరులును నీకు సాష్టాంగపడుదుమా అనెను (ఆదికాండము 37:9,10).

ఒక కుటుంబములో తండ్రి సూర్యుని వలె ప్రకాశించాలి, కుటుంబాన్ని సంరక్షించాలి, పోషించాలి, వెలుగులో నడిపించాలి! "శూరుడు పరుగెత్త నుల్లసించు నట్లు తన పథమునందు పరుగెత్త నుల్లసించుచున్నాడు. అతడు ఆకాశమున ఈ దిక్కు నుండి బయలుదేరి ఆ దిక్కు వరకు దాని చుట్టు తిరిగి వచ్చుచున్నాడు. అతని వేడిమికి మరుగైనది ఏదియు లేదు" (కీర్తన 19:5,6) అన్నట్లు తండ్రి చురుకైన వాడుగా, పరుగెత్తి పనిచేయువాడుగా, తన వేడిమిని అందరికి అందించువాడుగా, తన కుటుంబమంతటిని సంరక్షించువాడుగా ఉండాలి!

సూర్యుడు వేకువనే ఉదయించునట్లు. యోబువలె ప్రతి తండ్రి అరుణో దయమున లేచి, కుటుంబమంతటిని సమకూర్చి ప్రార్థించుట ఎంతో మంచిది! సూర్యుని వెలుగు చెట్లపై పడి, కిరణజన్య సంయోగ క్రియకు సహాయపడునట్లు; ఒక తండ్రి యొక్క ప్రభావము తన పిల్లలపై పడి క్రియాత్మకమైన ఎదుగుదలను, అభివృద్ధిని పొందుటకు సహాయపడును. కొన్నిసార్లు సూర్యుని వేడిమి తీవ్రముగా ఉన్నను, అది మేలు కొరకే అన్నట్లు తండ్రి గద్దింపులు, దిద్దుబాటులు కుటుంబమునకు ఎంతో అవసరము!

చంద్రుని వెలుగు సూర్యుని వెలుగు వలె ఉష్ణాన్ని కలుగజేసేది కాదు గాని; చల్లదనాన్నిస్తుంది, ప్రశాంతమైన వాతావరణాన్ని కలుగజేస్తుంది. అలాగే ఒక స్త్రీ ప్రేమను, ఆప్యాయతను, ఆదరణను తన ఇంటివారికి అందిస్తుంది. ఇంటిని ప్రశాంతమైన వాతావరణముతో, శాంతి సమాధానములతో నింపుకొంటుంది. భర్తకు సరైన సహకారిగాను, బిడ్డలకు మంచి తల్లిగాను ఉంటూ; వారి శరీర అవసరతలను, అన్నపానాలను గమనిస్తూ, చంద్రుని వలె ప్రకాశిస్తూ, జ్ఞానవంతురాలు వలె ఇల్లు కట్టుకొంటుంది. ఒక గృహములో తండ్రి గద్దించి, హెచ్చరించేవాడుగాను; తల్లి ప్రేమతో ఆదరించి, దిద్దేదిగాను ఉంటే ఆ ఇంటిలోని బిడ్డలు ధన్యులౌతారు!

చంద్రుడు స్వయంప్రకాశి కాదు గాని, సూర్యుని వెలుగును ప్రతిబింబింప జేయును. ఒక ఇంటిలోని తల్లిదండ్రులు ఎవరిమట్టుకు వారు ప్రకాశించుట కాదు గాని, ఒకే వెలుగును ప్రతిబింబింపజేయాలి! తల్లిదొక మాట, తండ్రిదొక మాట కాకుండా; తల్లిదండ్రులు ఒకే మాటపై ఉండి, ఒకే మనస్సును కలిగియుంటే వారి బిడ్డలు చక్కటి ప్రకాశంలో పెరుగుతారు, వర్ధిల్లుతారు. భార్యలారా, మీ స్వపురుషులకు లోబడియుండుడి; భర్తలారా, మీ స్వంత శరీరము వలె మీ భార్యలను ప్రేమించుడని బైబిలు చెప్పుచున్నది (ఎఫెసీ 5:22-28). సూర్యుని వెలుగును గ్రహించి ప్రకాశించిన చంద్రుని వలె, స్త్రీ భర్తతో కలిసి ప్రకాశిస్తే కుటుంబానికి అవసరమైన వెచ్చదనాన్ని, చల్లదనాన్ని; గద్దింపును, ప్రేమను అందించగలుగుతారు!

నక్షత్రములు సూర్యుని కంటె గొప్పవని, పెద్దవని విజ్ఞానవేత్తలు, శాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. అంతేగాక, లెక్కింపనలవిగానన్ని నక్షత్రములున్నను, అన్నియు ఒకటిగా ఉండక; వేర్వేరు మహిమలను, భేదములను కలిగియున్నవి. “మహిమను బట్టి యొక నక్షత్రమునకును మరియొక నక్షత్రమునకును భేదము కలదు గదా” (I కొరింథీ 15:41).

తల్లిదండ్రులనేకసార్లు పిల్లలను కించపరుస్తూ, వారు తమ కంటె గొప్పవారు కారనుకొందురు. తండ్రిని మించిన తనయులెందరినో ఈనాడు మనం చూడగలం! మన బిడ్డలు ఎదుగుతుండగా; వారిలోని తలాంతులను గుర్తించి, వాటిని వారు అభివృద్ధిపరచునట్లు ప్రోత్సహించాలి!

ఈనాడు విజ్ఞాన శాస్త్రములో రకరకాల నక్షత్రాలను, శాటిలైట్‌లను కనుగొని; అవి చేయగలిగిన పనులను గుర్తించి, వాటిని వాడుకొనుట ద్వారా ప్రపంచంలోని నలుమూలలకు సమాచారములను అందించుటకు ఇంటర్‌నెట్, టి.వి. వంటి పరికరాలను ఉపయోగిస్తున్నారు. దేవుని సృష్టి నుండి ఈ నక్షత్రములన్నీ ఉన్నను; వాటి ప్రతిభను గుర్తించి, వాటిని వాడుకొనుట ప్రారంభించిన తరువాతనే వాటి గొప్పతనాన్ని ప్రశంసించగలుగుచున్నాము!

అలాగే మన బిడ్డలు మన కుటుంబంలో ఎదుగుతున్నప్పుడు, వారిలో దేవుడు ఉంచిన ప్రతిభలను మనం బయటికి రప్పించినపుడే వారి గొప్పతనాన్ని గుర్తిస్తాము! గనుక తల్లిదండ్రులు బిడ్డలను ప్రోత్సాహపరచి, వారు యోగ్యులుగా దేవుని చేతిలో వాడబడునట్లు వారి తలాంతులను అభివృద్ధిపరచాలి! అంతేగాక, బిడ్డలు తమ వలె ఉండాలి, తమ పనే చేయాలి అని బలవంతము చేయక; వారిలో ఉన్న ప్రత్యేకతను గుర్తించి, వారు అభివృద్ధి పొందునట్లు అనుమతించాలి! మరియు బిడ్డలందరూ ఒకేలాగ లేరని నిరుత్సాహపడక; వారి వారి సామర్థ్యాలను, ప్రత్యేకతలను గుర్తించి, వారి విశేషతలను బట్టి వారిని ప్రశంసించాలి!

యాకోబు తన పన్నెండు మంది కుమారులు వేర్వేరుగా ఉండటం; వేర్వేరు క్రియలతో, వేర్వేరు పనుల కొరకు వేర్వేరు విధములుగా దేవునిచే ఏర్పరచబడటం గ్రహించాడు గనుకనే వారి విషయమై ప్రవచించాడు (ఆదికాండము 49వ అధ్యాయము చదవండి!).

ఆకాశములో దేవుడు సూర్య చంద్ర నక్షత్రాలను పెట్టి, వాటి వాటి పరిధుల్లో అవి ప్రకాశించి పని చేయాలని ఆశించినట్లే; ఈ భూలోకంలో దేవుడు "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి, అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచు చున్నది. పగటికి పగలు బోధ చేయుచున్నది, రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది. వాటికి భాష లేదు, మాటలు లేవు, వాటి స్వరము వినబడదు. వాటి కొలనూలు భూమి యందంతట వ్యాపించియున్నది, లోక దిగంతముల వరకు వాటి ప్రకటనలు బయలు వెళ్ళుచున్నవి" (కీర్తన 19:1-4) అన్నట్లు; క్రీస్తునందు విశ్వాసముంచిన కుటుంబము ప్రభువు మహిమను వివరిస్తూ, ప్రకటించేదిగా ఉండాలి! -యన్. జయపాల్

# ఆరోగ్య కారణము

ఒక అబ్బాయి చీటికి మాటికి మూతి ముడుచుకోవడానికి, కోపగించుకోవ డానికి అలవాటు పడ్డాడు. అయితే జ్ఞానము గలిగిన అతని తల్లి, ఆ బిడ్డ మనస్తత్వాన్ని మార్చాలని; అతడు ముఖము ముడుచుకొన్నప్పుడెల్లా 'సంతోషము గల మనస్సు ఆరోగ్య కారణము' అని నవ్వుతూ అనేది! ఆ మాట, ఆ తల్లి ముఖంలోని సంతోషము ఆ కుమారుడు తన ప్రవర్తన దిద్దుకొనుటకు తోడ్పడెను.

ఆ తల్లి ఆ కుమారుడికి ఒక ఉపన్యాసమో, ఒక ప్రసంగమో చేసేది కాదు గాని; కేవలం ఆ మూడు ముక్కలు చెప్పేది - "సంతోషము గల మనస్సు ఆరోగ్య కారణము" (సామెతలు 17:22). ఆ చిన్న బోధ వలన ఆ చిన్న బిడ్డ ప్రవర్తన మారిపోయినది. "సంతోష హృదయము ముఖమునకు తేట నిచ్చును" (సామెతలు 15:13).

– ఎడిటర్

# ఏర్పరచబడినావా? జాగ్రత్తపడు!

మన తల్లి గర్భములో మనలను యెరిగిన ప్రభువు, ప్రతివానిని ఒక ప్రత్యేకమైన పని కొరకు ఏర్పరచుకొంటున్నాడు. కొందరు ఆ విషయమును యెరుగకనే యున్నారు. మరికొందరు యెరిగినను, లోబడనందున నష్టపోతున్నారు. అయితే మరికొందరు ఆయన చిత్తము యెరిగి, లోబడి, ఆయన మహిమార్థమై వాడబడు చున్నప్పుడు గర్వమునకు చోటిచ్చి, అజాగ్రత్త వలన ఆ ఆధిక్యతలను పోగొట్టు కొంటున్నారు.

గాడిదలు వెదుకుతున్న సౌలును దేవుడు కనుగొని, ఇశ్రాయేలు జనాంగానికి రాజుగా అభిషేకించెను. అయితే సౌలు రాజైన తరువాత దురహంకారముతో అవివేకమునకు, అవిధేయతకు చోటిచ్చి (I సమూయేలు 13:8-14; 15:7-23); పశ్చాత్తాపపడనందున, దేవుని మాటకు లోబడి తన బ్రతుకును దిద్దుకొననందున, దేవుడు అతనికి ఎన్ని అవకాశములు ఇచ్చినను లోబడనందున దేవుడు అతనిని తృణీకరించెను. అతనికి బదులు తన చిత్తానుసారముగా మనస్సు గల దావీదును కోరుకొనెను.

సౌలు నలభై సంవత్సరములు ఇశ్రాయేలీయులకు రాజుగా ఉండెను గాని రెండు సంవత్సరములు మాత్రమే దేవునికి ఇష్టుడై యుండెను. అయినను దేవుడు ముప్పై యెనిమిది సంవత్సరములు రాజుగా ఉండుటకు అతనికి అవకాశము యిచ్చెను.

అయితే సౌలు దావీదుపై అసూయకు చోటిచ్చి; దురాత్మ చేత పీడించబడెను గాని, దేవుని చెంతకు రాలేదు. దేవుని సహవాసమును పోగొట్టుకొని, ఆయన చిత్తము యెరుగలేక అల్లాడెను గాని, పశ్చాత్తాపపడలేదు. తాను తోలివేసిన శకునగాండ్ర సహాయమును కోరెను గాని, తన తప్పును గ్రహించుకొనలేదు (I సమూయేలు 28:3-17). దేవుడు అతని రాజ్యము సదాకాలము ఉండవలెనని కోరెను గాని; అతడు అట్టి ఆశీర్వాదములు పోగొట్టుకొని, యుద్ధములో ఓడిపోయి, తన కత్తి మీద తానే పడి మరణించెను (I సమూయేలు 31:4).

గనుక మన పిలుపును యెరిగి, దేవునికి లోబడి; దేని నిమిత్తము క్రీస్తుయేసు చేత పట్టబడితిమో దానిని పట్టుకొనుటకు పరుగెత్తుచున్నాను అన్న పౌలు వలె క్రీస్తుయేసు నందు కలుగు ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానము కొరకు పరుగెత్తుదాం!

– యస్. జయపాల్

# బైబిలులోని జంతువులు మనకు నేర్పించు పాఠాలు!

✦ **పావురము** వలె నిష్కపటముగా ఉండుము! (మత్తయి 10:16)

✦ **సింహము** వలె ధైర్యముగా ఉండుము! (సామెతలు 28:1)

✦ **ఉడుము** వలె **పట్టుదల** కలిగియుండుము! (సామెతలు 4:4)

✦ **హంస** వలె **విచక్షణ** కలిగియుండుము! (యిర్మీయా 15:19)

✦ **గాడిద** వలె **కష్టపడి** పనిచేయుము! (ప్రసంగి 9:10)

✦ **లేడి** వలె **చురుకుగా** ఉండుము! (హబక్కూకు 3:19)

✦ **ఎద్దు** వలె **ప్రయాస**పడుము! (II తిమోతి 4:2)

✦ **కుక్క** వలె **విశ్వాసము** కలిగియుండుము! (యోహాను 14:1)

✦ **గువ్వ** వలె ప్రార్థనలో **మూలుగు**చుండుము! (రోమా 8:26)

✦ **చీమల** వలె **క్షేమము** కలిగియుండుము! (సామెతలు 6:6)

✦ **గొర్రె** వలె **దీనముగా** ఉండుము! (యెషయా 53:7)

✦ **కుందేలు** వలె దేవుని **ఆశ్రయించుము**! (కీర్తన 10:18; సామెతలు 30:26)

✦ **కోడిపుంజు** వలె **వేకువనే మొఱ్ఱపెట్టుము**! (మత్తయి 26:74)

✦ **నెమలి** వలె క్రీస్తు **సౌందర్యము** చూపించుము! (పరమగీతము 5:10)

✦ **గుఱ్ఱము** వలె సువార్త కొరకు **పరుగెత్తుము**! (యోబు 39:24; హెబ్రీ 1:1,2)

✦ **ఒంటె** వలె మోకరించి, ప్రార్థనలో **భారము** కలిగియుండుము! (కీర్తన 55:22)

✦ **ఆవు** వలె విన్న వాక్యమును **నెమరు**వేయుము! (కీర్తన 1:1,2)

✦ **పక్షిరాజు** వలె నూతన బలము పొంది, పైకి ఎగురుము! (కీర్తన 103:5)

✦ **పిచ్చుక** వలె దేవునిపై **ఆధారపడుము**! (కీర్తన 102:7)

✦ **మిన్నల్లి** వలె **విధేయత కలిగియుండుము**! (I సమూయేలు 24:14)

✦ **తేనెటీగ** వలె వాక్యమును హృదయములో **నింపుకొనుము**!
(కొలొస్స 3:16; కీర్తన 119:103) – ఎడిటర్


## కల్వరి ప్రేమధార పాఠకులకు విజ్ఞప్తి!

మీరు 'కల్వరి ప్రేమధార' అనే ఈ ద్వమాస పత్రిక చందా చెల్లించారా?
లేనియెడల దయచేసి మీ వార్షిక చందాను, బకాయిలను
ఈ రోజే యం.ఓ. చేసి లేక ఆన్‌లైన్‌లో పంపి, పత్రికాభివృద్ధికి తోడ్పడండి!

మా చిరునామా : కల్వరి, **29,** న్యూ కాలనీ రోడ్, వేలచ్చేరి, చెన్నై**-600 042.**

# పరిశుద్ధ గ్రంథము

ప్రపంచ సాహిత్యమంతటిలో బైబిలు మాత్రమే పరిశుద్ధ గ్రంథమని పిలువబడుచున్నది. బైబిలు, పుస్తకములన్నిటిలో శ్రేష్ఠమైన పుస్తకము. ఎందుకనగా బైబిలు యొక్క గ్రంథకర్త దేవుడే! బైబిల్లోని ముఖ్యాంశము–'క్రీస్తు ద్వారా పాపికి దేవుడు ఏర్పరచిన రక్షణ సంకల్పం'. పరిశుద్ధాత్మ దేవుని ప్రేరేపణ చేత దేవుని సందేశాన్ని ఆదేశాలుగా పొందిన ఇంచుమించు నలభై మంది ప్రవక్తలు, ఇంచుమించు 1600 సంవత్సరముల కాలవ్యవధిలో వేర్వేరు దేశాలలో, వేర్వేరు సమయాల్లో వ్రాసినదంతా సమకూర్చబడి, భద్రపరచబడి బైబిలయ్యింది. పాత నిబంధనలోని 39 పుస్తకములు హెబ్రీ భాషలో వ్రాయబడి యుండగా, క్రొత్త నిబంధనలోని 27 పుస్తకములు మొదట అరామిక్ భాషలో వ్రాయబడి, ఆ తరువాత గ్రీకు భాషలోనికి తర్జుమా చేయబడినవి.

బైబిలును నాశనం చేయడానికి అనేకులైన చక్రవర్తులు, నిరంకుశులు ప్రయత్నించిరి గాని విఫలమైరి. క్రీ.శ. 300 సంవత్సరముల కాలంలో ఈజిప్టులోని సాంస్కృతిక కేంద్రమైన అలెగ్జాండ్రియాలో పది లక్షల మంది గ్రీకు భాష మాట్లాడే యూదులు ఉండేవారు. వారి కృషి వలన బైబిలు మొదట గ్రీకు భాషలోనికి అనువదించబడినది. గ్రీకు మాట్లాడే వారందరు ఈ ప్రతిని సంపాదించుకొని, పఠించుట ప్రారంభించిరి. అయితే క్రీ.శ. 303లో రోమన్ చక్రవర్తి డియోక్లేషియన్ బైబిలు ప్రతులను స్వాధీనపరచుకొని, వాటన్నిటిని తగులబెట్టించెను. ఎదురు తిరిగిన మనుష్యులను కూడా ఆ మంటలలో తగులబెట్టించెను.

అయితే క్రీ.శ. 350వ సంవత్సరములో ఆదిమ సంఘముల నాయకుడైన జెరోమ్, ఆ కాలంలో ఎక్కువగా మాట్లాడే లాటిన్ భాషలోకి బైబిలును తర్జుమా చేసెను. 'వల్గేట్' అని పిలువబడిన ఆ బైబిలును అనేక సంవత్సరములు ఉపయోగించిరి. అయితే క్రీ.శ. 4వ శతాబ్దం వరకు బైబిలు పఠనం మతాధికారులకు, ఉన్నతాధికారులకు మాత్రమే పరిమితమై యుండేది.

ఈలాగు బైబిలు ఆయా సమయాల్లో, ఆయా వ్యక్తుల చేత అనువదించబడుచు, అనేకులకు అందించుబడుచున్నప్పటికి; రకరకములైన ఆటంకములను ఎదుర్కొనవలసి వచ్చెను. క్రీ.శ. 1382లో క్రీస్తునందు విశ్వాసముంచిన వారందరు తమ విశ్వాసాభివృద్ధికి బైబిలు చదవాలి అనే గ్రహింపు కలిగిన జాన్ విక్లిఫ్ మొట్టమొదటి సారిగా బైబిలంతటిని ఇంగ్లీషులోకి తర్జుమా చేసెను. అయితే క్రీ.శ. 1408లో పోప్ అధికారం లేకుండా, బైబిలును తర్జుమా చేయకూడదని హెచ్చరించబడెను.

అయినను బలమగు దేవుని హస్తము తోడైయుండగా, జెన్స్‌ఫ్లిష్ అను యౌవనస్థుడు క్రీ.శ. 1434లో జాన్ గూటెన్ బర్గ్ అనే పేరుతో ఒక అచ్చు యంత్రమును తయారుచేసెను. ఈ అచ్చు యంత్రముతో బైబిలును అచ్చువేయుట ప్రారంభించిరి. క్రీ.శ. 1525లో విలియం టిండేల్ క్రొత్త నిబంధనను గ్రీకు నుండి ఇంగ్లీషులోకి తర్జుమా చేసెను. ముద్రణా యంత్రముతో ముద్రించబడిన మొట్ట మొదటి ఇంగ్లీషు బైబిలు ఇదే!

విలియం టిండేల్ చేత తర్జుమా చేయబడి, ప్రింట్ చేయబడిన బైబిలు చదివి నందున అనేకుల మనోనేత్రములు వెలిగించబడుచుండెను. అయితే క్రీ.శ. 1536లో విలియం టిండేల్‌ను కొయ్యకు కట్టి కాల్చి చంపారు. అయినను 'ప్రభువా, ఇంగ్లాండ్ దేశపు రాజు యొక్క మనోనేత్రములు తెరువుము' అని అగ్నిలో హతసాక్షిగా చనిపోవు చున్న విలియం టిండేల్ చేసిన ప్రార్థన వలన క్రీ.శ. 1538లో ప్రతి పారిష్ సంఘంలో ఒక పెద్ద బైబిలు ఉంచవలెనని రాజైన హెన్రీ చేత ఆజ్ఞాపించబడెను.

కాలక్రమేణా బైబిలు, జన్మస్థలాన్ని వదలి ప్రపంచ నలుమూలల వ్యాపించ సాగెను. 15వ శతాబ్దం చివరిలో 30 భాషలలో మాత్రమే ఉన్న బైబిలు 19వ శతాబ్దం చివరకు 450 భాషల్లో వెలువడినది. ఇప్పుడు 3,350 భాషల్లో బైబిలు గాని, బైబిలులోని కొన్ని భాగములు గాని తర్జుమా చేయబడియున్నవి. మొట్టమొదట అచ్చు వేయబడిన గ్రంథము బైబిలు! ఇన్ని ఎక్కువ భాషలలోనికి తర్జుమా చేయబడిన గ్రంథము కూడా బైబిలే! ఇప్పుడు ఈ బైబిలు సంవత్సరమునకు 10 కోట్ల ప్రతులు అచ్చు వేయబడి అందించబడుచున్నవని అంచనా!

**– యన్. జయపాల్**

# బైబిలు గ్రంథము యొక్క ముఖ్య విభజన

బైబిలు గ్రంథము పాత నిబంధన, క్రొత్త నిబంధన అను రెండు భాగములుగా విభజింపబడెను. పాత నిబంధన గ్రంథము నాలుగు భాగములుగా విభజించబడెను. ఆదికాండము నుండి ద్వితీయోపదేశ కాండము వరకు గల ఐదు పుస్తకములు 'చట్టము' గాను, యెహోషువ నుండి ఎస్తేరు వరకు గల పండ్రెండు పుస్తకములు 'చరిత్ర' గాను, యోబు గ్రంథము నుండి పరమగీతము వరకు గల ఐదు పుస్తకములు 'కావ్యము' గాను, యెషయా గ్రంథము నుండి మలాకీ వరకు గల పదిహేడు పుస్తకములు 'ప్రవచనములు' గాను విభజింపబడెను.

క్రొత్త నిబంధన గ్రంథము కూడా నాలుగు భాగములుగా విభజింపబడెను. మత్తయి నుండి యోహాను వరకు గల నాలుగు పుస్తకములు 'సువార్తలు' గాను, అపొస్తలుల కార్యములు అను పుస్తకము 'సంఘ చరిత్ర' గాను, అపొస్తలుడైన పౌలు రోమీయులకు వ్రాసిన పత్రిక నుండి యూదా వ్రాసిన పత్రిక వరకు గల ఇరవైయొక్క పుస్తకములు 'నీతి బోధ పత్రికలు' గాను, ప్రకటన గ్రంథము 'అంత్యకాల ప్రవచనము' గాను విభజింపబడెను.

**– ఎడిటర్**

# మన ప్రార్థన - దేవుని జవాబు

ప్రార్థనా పరిచర్య బహు గొప్ప పరిచర్య! దేవుని బిడ్డలకు శక్తినిచ్చేది ప్రార్థన! ప్రేమతో పనిచేయుటకు, ప్రేమతో మాట్లాడుటకు సహాయపడేది ప్రార్థన! దైవభక్తిని కలిగించేది ప్రార్థన! గొప్ప కార్యాలను సాధించడానికి శక్తినిచ్చేది ప్రార్థన! ప్రార్థనకు పరిధి లేదు, హద్దు లేదు. ఏదైనా, ఏమైనా, ఎప్పుడైనా ప్రార్థన ద్వారా మనం పొంద గలం (యాకోబు 5:16,17; మత్తయి 17:20,21).

**అయితే దేవునికి మన ప్రార్థన వినబడకుండా చేసేవి -**

**1. స్వార్థము:** మన ప్రార్థనలు దేవుని నామానికి మహిమ తెచ్చేవిగాను, ఆయన చిత్తానుసారంగాను ఉన్నప్పుడు ప్రార్థనలకు జవాబులు దొరుకును. తప్పైన ఉద్దేశ్యాలతో, స్వార్థంతో చేసే ప్రార్థనలకు జవాబులు దొరకవు! (యాకోబు 4:3; I కొరింథీ 10:31).

**2. విగ్రహారాధన:** ఒక ఉద్దేశ్యమును గాని, ఒక వస్తువును గాని, ఒక వృత్తిని గాని, ఒక వ్యక్తిని గాని దేవుని స్థానములో ఉంచుకొంటే మనము ఎంత ప్రార్థించినా జవాబు రాదు. అయితే దేవునికి మొదటి స్థానమిచ్చి ప్రార్థించినప్పుడు తప్పక జవాబు వచ్చును (నిర్గమ 20:1-6; యెషయా 42:8).

**3. క్షమించలేని మనస్సు:** దేవుడు మనల్ని క్షమించుచున్నట్లు మనమితరులను క్షమించకపోతే, మన ప్రార్థనలకు జవాబులు రావు! ఇతరులు మనకు విరోధంగా చేసిన ప్రతి కీడును, అపకారమును, నిందను మనం క్షమించినప్పుడు మన ప్రార్థనలకు జవాబులు వచ్చును (మార్కు 11:25,26; ఎఫెసీ 4:32).

**4. ఒప్పుకొనని పాపము:** పశ్చాత్తాపపడని, ఒప్పుకొనని పాపము ప్రార్థనకు ముఖ్యమైన ఆటంకము! మన మనస్సాక్షి దోషారోపణ చేసే ప్రతి చిన్న పాపమును మనము ఒప్పుకొని, ప్రభువు సన్నిధిలో విడిచిపెట్టినప్పుడు మన ప్రార్థనలకు జవాబులు వచ్చును (కీర్తన 66:18; యెషయా 59:1,2; సామెతలు 28:13; కీర్తన 139:23,24).

**5. ఏకీభవించకపోవటము:** భర్త భార్యతో, భార్య భర్తతో ఏకీభవించనిచో ప్రార్థన ఆటంకపరచబడును. అయితే పురుషుడు తన భార్య బలహీనమైన ఘటమని గుర్తించి, ఆమెను భరిస్తూ, క్షమిస్తూ, ప్రేమించుట ద్వారా తన ప్రార్థనా జీవితానికి ఆటంకం లేకుండా చూచుకొనవచ్చును (I పేతురు 3:7; ఎఫెసీ 5:22-23).

**6. అవిశ్వాసము:** విశ్వాసము లేని ప్రార్థన దేవుని శక్తిని కదిలింపలేదు. దేవునియందు మనముంచు విశ్వాసము దేవుని ఘనపరచును గనుక దేవుడు మన ప్రార్థనలకు జవాబిచ్చును (యాకోబు 5:15; హెబ్రీ 11:6). అభ్యంతరపరచ బడని ప్రార్థన మనం చేసినప్పుడు, ప్రార్థన లోకమును మార్చగలదు!- **యన్. జయపాల్**

బైబిలు పఠనం :

# యెహోషువ

| | | | |
|---|---|---|---|
| గ్రంథకర్త | : యెహోషువ | అధ్యాయములు | : 24 |
| కాలము | : ఇంచుమించు క్రీపూ. 14వ శతాబ్దము | వచనములు | : 657 |
| ముఖ్యాంశము | : స్వాధీనపరచుకొనుట | ముఖ్య వచనములు | : 1:8; 11:23 |

**గ్రంథ విభజన**

| | | |
|---|---|---|
| 1 - 12 | అధ్యాయములు | : ఇశ్రాయేలీయులు పోరాటములతో కనానులో ప్రవేశించుట |
| 13 - 22 | అధ్యాయములు | : భూమిని విభజించి, గోత్రముల వారీగా పంచుట |
| 23 - 24 | అధ్యాయములు | : యెహోషువ చివరి సందేశము - మరణము |

యెహోషువ అనగా 'రక్షణ' అని అర్థము! యేసు అను గ్రీకు నామము, యెహోషువ అను హెబ్రీ నామము రెండూ ఒకటే! యెహోషువ అనగా 'యెహోవా రక్షణ' అనే అర్థము కూడా కలదు. యెహోషువ ఎఫ్రాయిము గోత్రము వాడు (సంఖ్యా 13:8). మోషే పనివాడిగా నలభై సంవత్సరములు నమ్మకముగా అరణ్యములో ఉన్నాడు (నిర్గమ 24:13). వేగు చూచుటకు వెళ్ళిన పండ్రెండు మందిలో ఒకడు (సంఖ్యా 13:8).

యెహోషువ నాయకుడైనప్పుడు ఇంచుమించు 80 సంవత్సరముల వాడు! కనాను కొరకు ఆరు సంవత్సరములు పోరాడాడు! 25 సంవత్సరములు గోత్రాలకు స్థలాలను పంచిపెట్టాడు. తన ఇంటివారితో పాటు దేవుని సేవించి, 110 సంవత్సరముల వయస్సప్పుడు మరణించి, ప్రభువు సన్నిధికి వెళ్ళాడు.

యెహోషువ నాయకత్వములో ఇశ్రాయేలీయులు పోరాడి, జయించి కనానును స్వతంత్రించుకోవలసి యున్నది. మోషే ప్రారంభించిన దానిని యెహోషువ పూర్తి చేసెను. అలాగే ధర్మశాస్త్రము గురిపెట్టిన దానిని యేసుక్రీస్తు సంపూర్ణము చేసెను. ఈ గ్రంథములో యేసుక్రీస్తు రక్షణ కర్తగాను, దానిని కొనసాగించువాడు గాను ఉన్నాడు.

ఇందులోని ప్రధాన అంశము – దేవుని విశ్వాస్యత, ఆయన వాగ్దానముల నెరవేర్పు! ఇందులోని యుద్ధములు ఆధ్యాత్మిక పోరాటములకు గుర్తు! అంతవరకు దేవుడు ధర్మశాస్త్రము ద్వారా మాట్లాడుచున్నాడు. నేటివరకు దేవుడు అధికముగా వాక్యము ద్వారా మాట్లాడుటకే ఇష్టపడుచున్నాడు.

ఇశ్రాయేలీయులు కనాను చేరాలంటే, యొర్దాను దాటాలి! యొర్దాను–క్రీస్తు మరణ, పునరుత్థానములకు గుర్తు! ప్రభువైన క్రీస్తు ద్వారానే తప్ప పరమ కనాను చేరుటకు మరియొక మార్గము లేదు. యెహోషువ గ్రంథమునకు, ఎఫెసీ పత్రికకు దగ్గర సంబంధమున్నది. యెహోషువ గ్రంథము యుద్ధములతో, పోరాటములతో నిండియున్నట్లే; ఎఫెసీ గ్రంథములో ఆధ్యాత్మిక పోరాటముల గురించి, జయము అనుగ్రహించు క్రీస్తును గురించి వ్రాయబడియున్నది. – యన్. జయపాల్

# వాల్డెమార్ హాఫ్కిన్ మీకు తెలుసా?

చైనా దేశము నుండి వచ్చే ఓడ ద్వారా 1896లో బుబొనిక్ ప్లేగు వ్యాధి మన దేశములోని ముంబై హార్బరులో ప్రవేశించింది. అయితే అంతకుముందే కలరా వ్యాధికి మందు కనిపెట్టమని పారిస్ నుండి మన దేశానికి పిలిపించబడిన యూదు క్రైస్తవుడు, మెడికల్ సైంటిస్ట్ అయిన డా॥ వాల్డెమార్ మొర్దెకై హాఫ్కిన్ (Dr. Waldemar Mordecai Haffkine) కలరా వ్యాధికి మందు కనుగొనే పరిశోధనలో ఉన్న తరుణంలో ఆ పరిశోధనను ప్రక్కనపెట్టి, సంభవించిన ప్లేగు వ్యాధికి మందు కనిపెట్టే పరిశోధన ప్రారంభించాడు.

పశువుల నుండి తీయబడిన ద్రావకం ద్వారా వ్యాక్సిన్ తయారుచేస్తే, హిందువులు దానిని వేయించుకోవడానికి ఇష్టపడరని తెలిసి; వారి మనోభావాలు కూడా దెబ్బ తినడానికి ఏ మాత్రం తావు ఇవ్వకుండా, వారు వంటలకు ఉపయోగించే నెయ్యి నుండి అతను వ్యాక్సిన్ తయారుచేసాడు.

అప్పటి ప్రభుత్వం ఈ తెగులు నివారణకై గట్టి చర్యలు తీసుకొన్నది. ఓడల మీద వచ్చే ప్రయాణికులు వ్యాధి సోకినవారా? కాదా? అని పరీక్షించడానికి వైద్యులతో కూడిన ఒక బృందం హార్బర్‌లో మకాం వేసింది. వ్యాధి సోకినవారికి చంకల్లో చిన్న చిన్న గడ్డలు లాంటివి రావడం, ఈ తెగులు యొక్క మొదటి దశ! గనుక అప్పటి ప్రయాణికులను పరీక్షించడానికి పురుషుల చొక్కా పైకి లేపి చంకలను చెక్ చేయడం, అలాగే మహిళలను కూడా చెక్ చేయడం జరిగేది.

ఈ వైద్య పరీక్షలు ప్రజలు సహించలేకపోయారు. 'ఉద్దేశ పూర్వకంగా కావాలనే బట్టలు విప్పి, మమ్మల్ని అవమానపరుస్తున్నారు' అని అపార్థం చేసుకొని, పెద్ద యెత్తున ఆందోళన చేసారు. వైద్య శిబిరాలపై నిప్పు పెట్టి తగలబెట్టారు, వైద్యులపై తీవ్రమైన దాడులు చేసారు, కాపలాగా ఉన్న సైనికులను కూడా చంపారు.

మన వాళ్ళ మూర్ఖత్వం వల్ల ఆ తెగులు బెంగుళూరు మరియు మదనపల్లి దాకా వ్యాపించింది. ఈ వ్యాధి వ్యాప్తి చెందుతున్న సమయంలో దానికి తగ్గట్టు ఎన్నో రకాలైన అపోహలు కూడా వ్యాప్తి చెందాయి. ఈ వ్యాధిని నివారించడానికి ఇంగ్లీష్ ప్రభుత్వం వారే వ్యాక్సిన్ రూపంలో 7,00,000 మందిని చంపి; వారి దేవునికి ఇవ్వాలని పెద్ద యెత్తున కుట్ర పన్నుతున్నారని మూర్ఖ మత ఛాందసవాదులు అపవాదును వ్యాప్తి చేసారు.

దానిని నమ్మి సామాన్య ప్రజలు అనవసరంగా ఆందోళన చెంది, ఆ వ్యాక్సిన్ వేయించుకోవడానికి భయపడ్డారు. పైగా అప్పటికే క్రైస్తవ మిషనెరీలు ఆయా పల్లెటూళ్ళకు, గిరిజన ప్రదేశాలకు వెళ్ళి; ఆరోగ్య సంబంధమైన వైద్య సలహాలు,

సూచనలు ప్రజలకు ఇస్తూ ఉన్న కారణంగా, వీరి సహాయం ద్వారా ప్రజలకు ఈ వ్యాక్సిన్ ఇవ్వడం సులభతరమౌతుందని; ప్రభుత్వం వారు ఈ మిషనెరీల సహాయం తీసుకొని, అనేక ప్రదేశాలు తిరుగుతూ ఉన్న సమయంలో; తమ్మును ఏదో క్రొత్త మందుతో చంపాలనే కుట్ర జరుగుతున్నదనే అపోహ మరింత బలపడింది.

అయితే క్రైస్తవ మిషనెరీలు ఆ వ్యాక్సిన్ వేయించుకొని, తక్కిన వారిలో ఉన్న ఆ అపోహను తొలగించారు. అలా మిషనెరీలు వేయించుకొన్న పిదప, మిషనెరీ పాఠశాలలకు వెళ్ళి పిల్లలకు వేయించారు. పిల్లలు మాత్రమే కాక, మహిళా ఉపాధ్యాయినులు, అక్కడ పనిచేసే పనివాళ్ళు కూడా వేయించుకొన్నారు. అలాగే అక్కడి బ్రాహ్మణ ఉపాధ్యాయుడు కూడా వేయించుకొన్నాడు. అలా ఒక మిషనెరీ గాని, ఒక డాక్టరు గాని ప్రజల ముందు వేయించుకొన్నప్పుడు ధైర్యం కలిగి ప్రజలు గుమి కూడేవారు. అలా వ్యాక్సిన్లు అన్నీ అయిపోయేవి!

ప్రఖ్యాతి గాంచిన భారతీయ వైద్యుడు డా॥ ఓం ప్రకాష్ జగ్గీ గారు తాను వ్రాసిన ఓ గ్రంథంలో వాల్డెమార్ హాఫ్కిన్ గూర్చి పొగుడుతూ ఎంతో గొప్పగా వ్రాసారు. కలరా రోగం సోకిన కారణంగా ఎనభై శాతం మంది తుడిచిపెట్టుకుపోతున్న సమయంలో, వాల్డెమార్ హాఫ్కిన్ తలపెట్టిన పరిశోధన మృత్యువాత పడుతున్న మానవాళికి అరుణోదయం కలిగించింది. విద్యాపరమైన నాణ్యతా ప్రమాణాలు గల లాన్సెట్ మరియు ఇండియన్ మెడికల్ గెజిట్ లాంటి జర్నల్ పత్రికలు ఆయన చేసిన పరిశోధనలను వైద్యరంగంలో విశిష్టమైన మైలురాయిగా పొగిడాయి.

డాక్టర్ వాల్డెమార్ హాఫ్కిన్ తాను కనిపెట్టిన వ్యాక్సిన్ల ద్వారా మన దేశానికి ఎంత గొప్ప మేలు చేసాడో మాటల్లో వివరించడం సాధ్యం కాదు. అతడు అనేక మందికి ప్రాణభిక్ష పెట్టాడు.

– ఎడిటర్


మీరు చదివారా?

## Dr. N. జయపాల్ గారి రచనలు

స్త్రీలకు, పురుషులకు, యౌవనస్థులకు, పిల్లలకు, కుటుంబమంతటికి అవసరమైన సందేశములు; అలాగే సేవకులకు, ప్రసంగీకులకు, సండేస్కూల్ టీచర్స్‌కు, బైబిలు విద్యార్థులకు ఉపయోగపడే ప్రసంగాంశములు, ఉపమానములు, సందేశములతో కూడిన; డా॥ జయపాల్ గారు తాను 48 సంవత్సరముల సేవా జీవితములో ప్రభువు పాదముల వద్ద నేర్చుకొన్న విషయాలతో వ్రాసిన 52 పుస్తకములు సిద్ధముగా ఉన్నవి.

ఈ పుస్తకముల మొత్తము వెల రూ. 3,000/-. అయితే కల్వరి ప్రేమధార పాఠకులకు కేవలం రూ. 2,000/- లకే ఇవ్వబడును. మీరు చెన్నై లేక విజయవాడలో నేరుగా ఈ పుస్తకములు పొందవచ్చు! పోస్ట్ ద్వారా పొందగోరువారు రూ. 2,000/- + రిజిస్టర్డ్ పోస్ట్ ఖర్చు రూ. 200/- లను పంపగలరు!

**వివరములకు (0) 89 39 39 39 39 నంబర్‌కు సంప్రదించండి!**

# పరిశుద్ధాత్మ ద్వారా కుమ్మరించబడిన ప్రేమ

**"మనకు అనుగ్రహింపబడిన పరిశుద్ధాత్మ ద్వారా దేవుని ప్రేమ మన హృదయములలో కుమ్మరింపబడి యున్నది".** (రోమా 5:5)

పరిశుద్ధాత్ముడు అనేక కృపావరములను మనకు అనుగ్రహించియున్నాడు. "ఒకనికి ఆత్మ మూలముగా బుద్ధి వాక్యమును, మరియొకనికి ఆ ఆత్మననుసరించిన జ్ఞాన వాక్యమును, మరియొకనికి ఆ ఆత్మ వలననే విశ్వాసమును, మరియొకనికి ఆ ఒక్క ఆత్మ వలననే స్వస్థపరచు వరములను, మరియొకనికి అద్భుత కార్యములను చేయు శక్తియు, మరియొకనికి ప్రవచన వరమును, మరియొకనికి ఆత్మల వివేచనయు, మరియొకనికి నానావిధ భాషలును, మరియొకనికి భాషల అర్థము చెప్పు శక్తియు అనుగ్రహింపబడియున్నవి (I కొరింథీ 12:8-10).

"అయితే కృపా వరములలో శ్రేష్ఠమైన వాటిని ఆసక్తితో అపేక్షించుడి (I కొరింథీ 12:31). అంతేగాక "విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ యీ మూడును నిలుచును; వీటిలో శ్రేష్ఠమైనది ప్రేమయే" (I కొరింథీ 13:13). అట్టి క్రీస్తు ప్రేమను మన హృదయములలో కుమ్మరించువాడు పరిశుద్ధాత్మ దేవుడే!

గనుక ఒకడు పరిశుద్ధాత్మతో నింపబడినప్పుడు, అతడు ఆ అగాపే ప్రేమతో నింపబడును. ఆ ప్రేమతో నింపబడని యెడల దేవదూతల భాషలతో మాట్లాడినను, ప్రవచించు కృపావరములు కలిగినను, కొండలను పెకలింపగల విశ్వాసము కలిగి యున్నను నేను వ్యర్థుడను అని పౌలు అన్నాడు. గనుక ఈ అంత్య దినములలో స్వస్థతలు, భాషలు, జ్ఞానము, అభిషేకము అనే మరనేక అంశములకు ప్రాముఖ్యత యిస్తున్నాము గాని; దీర్ఘకాలము సహించే, దయ చూపించే ప్రేమను; మత్సరపడని, డంబముగా ప్రవర్తింపని ప్రేమను; ఉప్పొంగని, అమర్యాదగా నడువని ప్రేమను; స్వప్రయోజనమును విచారించుకొనని, త్వరగా కోపపడని ప్రేమను; అపకారమును మనస్సులో ఉంచుకొనని ప్రేమను; దుర్నీతియందు గాక సత్యమునందు సంతోషించు ప్రేమను; అన్నిటిని తాళుకొని, అన్నిటిని నమ్మిన ప్రేమను; అన్నిటిని నిరీక్షించి, ఓర్చుకొనే ప్రేమను కలిగియుండాలనే అపేక్ష లేనివారిగా ఉన్నాము!

అంత్య దినములలో అనేకుల ప్రేమ చల్లారునని, సహోదరుని ద్వేషించువాడు ప్రేమ లేనివాడని బైబిలు చెప్తున్నది. మీరు ఒకరిని ఒకరు ప్రేమించుకొనుట ద్వారా మీరు నా శిష్యులని లోకము తెలిసికొనును అని ప్రభువు చెప్పెను గనుక ప్రేమ కలిగియుండుటకు ప్రయాసపడదాం! పరిశుద్ధాత్ముని ద్వారా దేవుని ప్రేమను మన హృదయములలో కుమ్మరింపబడునట్లు క్రీస్తు నామములో ప్రార్థిద్దాం! - **యన్. జయపాల్**

ప్రార్థన :

# ప్రభువా! నాకు నేర్పుము!

- ప్రతి దినము మీతో ఆరంభించుట, మీతో ముగించుట నాకు నేర్పుము!
- ఒంటరిగా ఉన్నప్పుడు విస్తార ప్రార్థన; సంఘములో, సమాజములో ఉన్నప్పుడు క్లుప్త ప్రార్థన చెయ్యడం నాకు నేర్పుము!
- నా మనసుకు నచ్చినట్లు, నాకు వచ్చినట్లు కాకుండా; మీరు మెచ్చుకొనే విధంగా, మీకు నచ్చే విధంగా ప్రార్థించడం నాకు నేర్పుము!
- చదువుతున్న మీ వాక్యాన్ని అర్థం చేసుకొని, నా జీవితానికి అన్వయించుకోవడం నాకు నేర్పుము!
- ఆత్మఫలము మరియు సర్వాంగ కవచము ఆదివారము మాత్రమే కాక, అనుదినము కలిగియుండుట నాకు నేర్పుము!
- ఒకవేళ నా వలన నా సహోదరుడు బాధపడితే లేక అభ్యంతరపడితే నా తప్పు లేకపోయినా, క్షమాపణ కోరడం నాకు నేర్పుము!
- మీ కృపలో మీరు నాకు నేర్పించిన మరియు బయలుపరచిన విషయాలన్నిటిలో నమ్మకంగా ఉండటం నాకు నేర్పుము!
- తగ్గింపు జీవితాన్ని నాకు నేర్పుము!
- మీరు పిలుచుకొన్న పిలుపుకు తగినట్లుగా నడవటం నాకు నేర్పుము!
- విశ్వాసంతో అడగటం మరియు పొందుకొనే వరకు నిరీక్షణ కలిగి వేచియుండటం నాకు నేర్పుము!
- నా ఫోన్‌ని సరైన రీతిలో వాడటం నాకు నేర్పుము!
- మీ బిడ్డగా ఈ లోకంలో మాదిరికరమైన జీవితం కలిగియుండుట నాకు నేర్పుము!
- నేను ఏమి చేసినను మీ కొరకు చెయ్యడం నాకు నేర్పుము!
- ఎదుటి వ్యక్తిలోని మంచిని, నాలోని లోపాలను చూడటం నాకు నేర్పుము!

– సెలెక్టెడ్


## కల్వరి ప్రేమధారల స్పైరల్ బౌండ్ బుక్స్

2013, 2015, 2016, 2017 మరియు 2018 సంవత్సరముల 'కల్వరి ప్రేమధార' పత్రికలు ఏ సంవత్సరానివి ఆ సంవత్సరం స్పైరల్ బౌండ్ బుక్స్‌గా (మొత్తం 5) సిద్ధంగా యున్నవి! ఒక్కొక్క సంవత్సరపు బౌండ్ బుక్ వెల రూ. 150/-. అన్నీ కావాలంటే రిజిస్టర్డ్ పోస్ట్ ఖర్చుతో పాటు రూ. 450/- పంపి, పొందగలరు!

మీరు M.O.లు పంపవలసిన చిరునామా :

**CALVARY, 29, New Colony Road, Velachery, Chennai - 600 042.**

ప్రకటన సందేశం : (గత సంచిక తరువాయి....)

# బలిష్ఠుడైన క్రీస్తు

"బలిష్ఠుడైన వేరొక దూత పరలోకము నుండి దిగివచ్చుట చూచితిని. ఆయన మేఘము ధరించుకొని యుండెను. ఆయన శిరస్సు మీద ఇంద్రధనుస్సుండెను; ఆయన ముఖము సూర్యబింబమువలెను ఆయన పాదములు అగ్ని స్తంభములవలెను ఉండెను. ఆయన చేతిలో విప్పబడియున్న యొక చిన్న పుస్తకముండెను. ఆయన తన కుడిపాదము సముద్రము మీదను మోపి, సింహము గర్జించునట్లు గొప్ప శబ్దముతో ఆర్భటించెను. ఆయన ఆర్భటించినప్పుడు ఏడు ఉరుములు వాటి వాటి శబ్దములు పలికెను". (ప్రకటన 10:1-4)

ఏడవ బూర ఊదుటకు ముందు జరిగిన విషయములను మనం 10వ అధ్యాయంలో చూస్తున్నాం! పరలోకము నుండి దిగివచ్చిన బలిష్ఠుడైనవాడు మన యేసుక్రీస్తే! ఆయనకు బలవంతుడైన దేవుడని పేరు గలదు (యెషయా 9:6). ఆయన మేఘము ధరించుకొని యుండెను అనునది; మేఘము ఆయనను ఆకాశము నకు కొనిపోవుటను (అపో.కార్య. 1:9); మేఘారూఢుడై ఆయన త్వరలో రాబోవుటను (ప్రకటన 1:7) చూపిస్తున్నది.

ఆయన ముఖము సూర్యబింబము వలెను, ఆయన పాదములు అగ్ని స్థంభముల వలెను ఉండెనన్నది – రూపాంతరము పొందినప్పుడు ఆయన ముఖము సూర్యుని వలె ప్రకాశించెను, ఆయన వస్త్రములు వెలుగు వలె తెల్లనివాయెను అనునదియు (మత్తయి 17:2); ఆయన ముఖము మహా తేజస్సుతో ప్రకాశించుచున్న సూర్యుని వలె ఉండెను (ప్రకటన 1:16) అనునదియు జ్ఞాపకము చేయుచున్నది.

ఆయన చేతిలో విప్పబడిన చిన్న పుస్తకము – లోపటను వెలుపటను వ్రాత కలిగి, ఏడు ముద్రలు గట్టిగా వేసియుండగా ఆయన విప్పిన గ్రంథము (ప్రకటన 5:1) లోని ఒక భాగమై యుండును. బహుశా అది చివరి భాగము!

ఆయన తన కుడిపాదము సముద్రము మీదను, ఎడమ పాదము భూమి మీదను మోపుట – ఆకాశము నా సింహాసనము, భూమి నా పాదపీఠము అన్న విషయాన్ని; భూమిని, సముద్రమును సృష్టించుటను; తన బలిరక్తము ద్వారా లోకాధికారియైన సాతానును ఓడించుటను చూపించుచున్నది. ఆయన స్వరము సింహగర్జన వలె ఉండుట ఆయన యూదా రాజ సింహమని; ఆయన కంఠస్వరము ఉరుముల వలెను, విస్తార జల ప్రవాహముల ధ్వని వలెను ఉండుట ఆయన

అధికార, ప్రభావాలను చూపించుచున్నది. దేవుడు సెలవిచ్చిన కార్యములు నెరవేరుటకు ఇక ఆలస్యము లేదని; ఏడవ దూత బూర ఊదుచుండగా దేవుడు తన దాసులకు, ప్రవక్తలకు తెలిపిన సువార్త ప్రకారము దేవుని మర్మము సమాప్త మగునని చెప్పెను (ప్రకటన 10:7).

అనగా ఏడవ బూర ఊదిన తరువాత ఇక సువార్తను ప్రకటించనవసరము లేదు; ప్రవచన మర్మములను తెలియజేయనవసరం లేదు. ఇక మనుష్యులు పశ్చాత్తాప పడుటకు గాని, రక్షణ పొందుటకు గాని ఎటువంటి అవకాశము ఉండదు అన్న విషయమును తెలియజేసెను.

ఏ ఒక్కడు నశించుట ఇష్టము లేని ప్రభువు తన సేవకుల ద్వారా, ప్రవక్తల ద్వారా మనుష్యులకు తన ప్రేమను ప్రకటించెను. సిలువలో తన ప్రాణము పెట్టుట ద్వారా మానవునికి విమోచన ప్రకటించెను. యేసుక్రీస్తును విశ్వాసమును బట్టి రక్షకునిగా అంగీకరించుట ద్వారా చీకటిలో నుండి వెలుగులోనికి, మరణములో నుండి జీవములోనికి మనుష్యులు దాటిపోవునట్లు అవకాశము కలిగించెను. అనేక సంవత్సరములు ఈ సువార్తను ప్రకటించుటకు అవకాశమిచ్చెను. అయితే ఇప్పుడిక ప్రవచనములు, మర్మములు అవసరం లేదు. ఇంతవరకు ప్రకటించిన సువార్తను అంగీకరించినవారు ఆయన రాజ్య వారసులగుదురు, అంగీకరించనివారు తీర్పు తీర్చబడుదురు.

యోహాను ఆ చిన్న పుస్తకమును నాకిమ్మని అడుగగా; ఆయన – దానిని తీసుకొని తినివేయుమని; అది నీ కడుపునకు చేదగును గాని నీ నోటికి తేనెవలె మధురముగా ఉండునని చెప్పెను. ఇక్కడ ఈ చిన్న పుస్తకము దేవుని వాక్యమునకు కూడా గుర్తుగా ఉన్నది. "నీ మాటలు నాకు దొరకగా నేను వాటిని భుజించితిని" అని యిర్మీయా అనెను (యిర్మీయా 15:16). "నేను దానిని భక్షించితిని; అది నా నోటికి తేనెవలె మధురముగా ఉండెనని" యెహెజ్కేలు అనెను (యెహెజ్కేలు 3:3).

దేవుని మాటలు మనము విని అనగా తిని, జీర్ణించుకొని ఇతరులకు ప్రకటించ వలసి యున్నది. దేవుని మాటలు వినుటకు అనగా తినుటకు మధురముగా ఉండును గాని, వాటిని జీర్ణించుకొని అనుసరించుట కష్టతరమగును. ఎందుకనగా, దేవుని వాక్యము మన హృదయములో జొరబడినప్పుడు అది మన ప్రతి పాపమును బయటపెట్టి పశ్చాత్తాపమును కలిగించును. ఇక్కడ ప్రభువు ఏడవ బూర ఊదబడు టకు ముందు తాను వాగ్దానము చేసిన ఇశ్రాయేలు జనాంగముల నిమిత్తము చివరగా ఒక అవకాశము ఇచ్చుచున్నాడు. కారణం, వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడు, మాట యిచ్చి నెరవేర్చువాడు. **(ప్రశేషం)** – యస్. జయపాల్

# మంచి మనస్సాక్షి కలిగియుండుట!

**"ఈ విధమున నేనును దేవుని యెడలను, మనుష్యుల యెడలను ఎల్లప్పుడు నా మనస్సాక్షిని నిర్దోషమైనదిగా ఉండునట్లు అభ్యాసము చేసికొనుచున్నాను".**

(అపొ. కార్య. 24:16)

అపొస్తలుడైన పౌలు ఆత్మల సంపాదన వేటలో ముందుకు సాగుటయే కాక; దేవుని ముందు, మనుష్యుల ముందు తన మనస్సాక్షిని ఎల్లప్పుడు నిర్దోషముగా కాపాడుకొనుటకు అభ్యాసము చేసుకొనుచుండెను. 'భక్తి అంటే బహిరంగంగా చేయు కొన్ని పనులే' అనుకొంటున్న ఈ దినాలలో భక్తి అంటే మనస్సాక్షిని నిర్దోషముగా యుంచుకొనుట, హృదయాన్ని పరిశుద్ధంగా కాపాడుకొనుటయని మనం గుర్తుంచుకోవాలి!

పాత నిబంధనలో దావీదు హృదయ శుద్ధిని ప్రేమించుచు "దేవా, నన్ను పరిశోధించి నా హృదయమును తెలిసికొనుము. నన్ను పరీక్షించి నా ఆలోచనలను తెలిసికొనుము. నీకాయాసకరమైన మార్గము నాయందున్నదేమో చూడుము. నిత్య మార్గమున నన్ను నడిపింపుము" (కీర్తన 139:23,24) అని ప్రభువుకు మొఱ్ఱపెట్టుచుండెడివాడు. దేవుని సన్నిధిలో తన హృదయాన్ని పరిశోధించుకొని, దేవునికి ఆయాసకరమైన మార్గములను ఒప్పుకొని విడిచిపెట్టే భక్తి గొప్ప భాగ్యము! ఇట్టి భక్తి అనేకులలో లోపిస్తున్నది.

క్రొత్త నిబంధనలో, పౌలు మనస్సాక్షిని కాపాడుకొనుటను గూర్చి ఎంతో ప్రయాసపడుచున్నాడు. మనుష్యుల యెదుట, దేవుని యెదుట మన మనస్సాక్షిని కాపాడుకోవటం ఎంతో అవసరం! కాని నేడు అనేకులు తమ మనస్సాక్షిని కల్మష పరచుకొని, భ్రష్ఠ స్థితికి దిగజారిపోవుచున్నారు. అనేకులు వారి తప్పులను, వారి నిజస్థితిని మనుష్యుల యెదుట ఒప్పుకొననందున వారి మనస్సాక్షిని చంపుకొనుచు, వేషధారణ జీవితమునకు గురియవుచున్నారు.

పౌలు తన మనస్సాక్షిని జాగ్రత్తగా ఉంచుకొనుటకై ఎంతో ప్రయాసపడిన ఆచరణా భక్తిపరుడు! "ఇతరులకు ప్రకటించిన తరువాత నేనే భ్రష్ఠుడనైపోదునేమోనని నా శరీరమును నలుగగొట్టి దానిని లోబరచుకొనుచున్నాను" (I కొరింథీ 9:27) అని అనెడివాడు. దేవుని వాక్యాన్ని పఠించే నీవు, ప్రకటించే నీవు రెండంచుల ఖడ్గమైన దేవుని వాక్యము నిన్ను ఛేదించునట్లుగా అనుమతిస్తున్నావా? ఇదే పౌలు భక్తి! ఇది నేడు మనకెంతో అవసరము!

నేడే నీ హృదయము దోషారోపణ చేయు తప్పులను అనగా మనుష్యులకు వ్యతిరేకంగా చేసినవి మనుష్యుల యెదుటను, దేవునికి వ్యతిరేకంగా చేసినవి దేవుని యెదుటను ఒప్పుకొనినట్లయితే క్రీస్తు యొక్క రక్తము నిర్జీవ క్రియలను విడచి, జీవము గల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని ఎంతో ఎక్కువగా శుద్ధి చేయును (హెబ్రీ 9:14). ఆమేన్!

-ఎడిటర్

## బైబిల్ గ్రంథమందు బహుగా వ్రాయబడిన పేర్లు

| | | |
|---|---|---|
| 1. | దావీదు | 1118 సార్లు |
| 2. | మోషే | 740 సార్లు |
| 3. | అహరోను | 339 సార్లు |
| 4. | అబ్రాహాము | 306 సార్లు |
| 5. | సొలొమోను | 295 సార్లు |
| 6. | యాకోబు | 270 సార్లు |
| 7. | యోసేపు | 208 సార్లు |
| 8. | యెహోషువ | 197 సార్లు |
| 9. | పౌలు | 185 సార్లు |
| 10. | పేతురు | 166 సార్లు |
| 11. | యిర్మీయా | 136 సార్లు |
| 12. | సమూయేలు | 135 సార్లు |
| 13. | శారా | 52 సార్లు |
| 14. | రాహేలు | 47 సార్లు |
| 15. | లేయా | 34 సార్లు |
| 16. | రిబ్కా | 31 సార్లు |
| 17. | యెజెబెలు | 23 సార్లు |
| 18. | మరియ | 19 సార్లు |
| 19. | అబీగయీలు | 15 సార్లు |
| 20. | మగ్దలేనే మరియ | 14 సార్లు |
| 21. | హాగరు | 14 సార్లు |
| 22. | హవ్వ | 4 సార్లు |

బైబిలు గ్రంథమందు ఎవరి పేరు ఎన్నిసార్లు వ్రాయబడినను; జీవ గ్రంథ మందు నీ, నా పేరు ఒక్కసారి వ్రాయ బడితే చాలు! అది ఎంతో గొప్ప ధన్యత! ఆ జీవ గ్రంథమందు మన పేరు కూడా ఉండాలని కోరుకొందాం! ఆమేన్! -ఎడిటర్

## ప్రతి క్రైస్తవుడు కలిగియుండవలసిన లక్షణములు

1. కనిపెట్టు - కలవరపడకు!
2. ప్రార్థించు - పట్టుదల విడువకు!
3. నిరీక్షించు - నిరుత్సాహపడకు!
4. ఎదురుచూడు - ఎదిరించకు!
5. అర్థం చేసుకో-అపార్థం చేసుకోకు!
6. విధేయత చూపు-విసుగు చెందకు!
7. ప్రేమించు కాని-పాపము చేయకు!
8. ఆలోచించు - ఆవేశపడకు!
9. సువార్త చాటు - సిగ్గుపడకు!
10. నిజాయితీతో ఉండు - నటించకు!
11. జాగ్రత్తగా ఉండు-జాగు చేయకు!
12. సహించు - సణగకు!
13. ఆదరించు - అవమానించకు!
14. తగ్గించుకో - తిరస్కరించకు!
15. నిమ్మళపరచు - నిందించకు!
16. నిబ్బరముగా ఉండు-నీరసించకు!
17. సొమ్మసిల్లకు - సామర్థ్యం చూపు!
18. ధైర్యముగా ఉండుము-దిగులు పడకు!
19. అందుబాటులో ఉండు - అపకారము చేయకు!
20. భయభక్తులు కలిగియుండు - భయపడకు!

ఈ విధంగా ఉండటానికి మన మందరము ప్రభువు కృపను వేడుకొందాం!

- ఎడిటర్

# నోరు జారితే....!

ఒక రోజు ఒకతను మామూలుగా ఉదయం పళ్ళు తోముకోవటానికి టూత్ పేస్టు తీసుకొని బ్రష్ మీద ఒత్తుతూ, పొరపాటున ఎక్కువ ఒత్తేసాడు! తిరిగి ట్యూబ్ లోనికి ఎక్కించాలని ఎంత ప్రయత్నించినా సాధ్యపడలేదట! అలాగే వెనక్కి తీసుకోలేని మూడు సంగతులు గుర్తు చేసుకొందాము! ఒకటి - పోగొట్టుకొన్న తరుణం, రెండు - గురి చూచి వదలిన బాణం, మూడు - త్వరపడి జారిన మాట!

చాలాసార్లు మనం సమయం దాటిపోయిందని విచారిస్తుంటాము. బాణం వదలిన తరువాత బాధపడుతుంటాము. నోరు జారిన తరువాత బాధపడుతుంటాము. పరిహాసంతో మనకు తెలియకుండానే నోరు జారిన సందర్భాలు ఎన్నో ఉంటాయి. వినినవారు బాధపడి మనకు దూరమైన సందర్భాలు కూడా లేకపోవు! మాట్లాడవలసినప్పుడు మాట్లాడవలసిన మాట మాట్లాడలేకపోవడం, మాట్లాడనవసరము లేనప్పుడు మాట్లాడటం నష్టాలను కలుగజేస్తుంది. అందుకే బైబిలు "ప్రతి మనుష్యునికి ఏలాగు ప్రత్యుత్తరమీయవలెనో అది మీరు తెలుసుకొనుటకై మీ సంభాషణ ఉప్పు వేసినట్టు ఎల్లప్పుడు రుచిగలదిగాను, కృపాసహితముగాను ఉండనియ్యుడి" (కొలొస్స 4:6) అని చెప్పుచున్నది.

యిర్మీయా భక్తుడు మానవుల నాలుకలు ఎంత ఘాటైనవో తెలియజేయుచున్నాడు - "వారి నాలుక ఘాతుక బాణము, అది కాపట్యము పలుకుచున్నది. ఒకడు మనస్సులో వంచనాభిప్రాయముంచుకొని, నోట తన పొరుగువానితో సమాధానముగా మాటలాడును" (యిర్మీయా 9:8). దేవుడు మనకు రెండు నోళ్లు, ఒక చెవి ఇవ్వలేదు గాని; ఒక నోరు, రెండు చెవులు యిచ్చాడు. గనుక మనం తక్కువ మాట్లాడాలి, ఎక్కువ వినాలి అని దేవుని ఉద్దేశ్యం! మరి నీ జ్ఞానేంద్రియాలు ఎలా వాడుతున్నావో పరీక్షించుకో! నీ నోరును, నాలుకను దేవునికి అప్పగించుము!

"నీవు మౌనివై వారిని గద్దింపక యుండునట్లు నేను నీ నాలుక నీ అంగిటికి అంటుకొనజేసెదను. అయితే నేను నీతో మాటలాడి నీ నోరు తెరచెదను" (యెహెజ్కేలు 3:25-27) అని ప్రభువు యెహెజ్కేలుతో అనెను. ఇటువంటి తర్ఫీదు ప్రభువు మనకును ఇచ్చును గాక!

**- యస్. జయపాల్**

**(ఇటువంటి కథలు, ఉపమానములు గల "సువార్త కథలు", "కరుణ కథలు" మరియు "క్రీస్తు ప్రేమ కథలు" అనే మూడు పుస్తకములు కావలసినవారు రిజిస్టర్డ్ పోస్ట్ ఖర్చుతో సహా రూ. 230/- పంపి, పొందగలరు!)**

# ఇదీ నేటి క్రైస్తవ్యం!

★ చర్చిలో 10 రూపాయలు అధికం!
కాని షాపింగ్‌లో రూ. 1,000/– చాలా తక్కువ!

★ 2 గంటల సమయం ప్రార్థనకు కష్టమైన పని!
కాని 2 గంటల చిత్రం/ మూవీ బోరింగ్ కాదు!

★ ప్రార్థనలకు తగినంత పదాలు లేవు, రావు!
కాని ఇతరులను గూర్చి గాసిప్ చెప్పడానికి తగినంత పదాలు ఉంటాయి!

★ ఆరాధనలు సర్వసాధారణంగా, విచారంగా బోరింగ్ అయ్యాయి!
కాని టి.వి.లో కామెడీ ప్రదర్శనలు వింతగా, ఆనందంగా అనుభవిస్తుంటారు!

★ బైబిలు నుండి ఒక అధ్యాయం చదవడం కష్టం!
కాని 1000 SMSలు చదవడం చాలా సులభం!

★ చర్చిలో చివరి సీటులో ఉంటారు!
కాని సాంస్కృతిక కార్రక్రమాల్లో ముందు సీటులో ఉండాలని కోరుకొంటారు!

★ రోజూ టి.వి. సీరియల్ శీర్షిక కోల్పోకూడదు!
కాని వాక్యమునకు, ప్రార్థనకు సమయం లేదు అంటారు!

★ పాఠశాలకు, కార్యాలయముకు సమయానికి వెళ్తారు!
కాని దేవుని మందిరానికి ఎంత ఆలస్యమైనా, ఫరవాలేదు అనుకొంటారు!

★ పాఠశాలలో మా పిల్లలు ఎలా చదువుతున్నారు అని ఆరా తీస్తారు, దగ్గరుండి మరీ చదివిస్తారు!
కాని పిల్లలు దేవుని వాక్యాన్ని అధ్యయనము చేయడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయరు!

★ పాఠశాలకు, ఉద్యోగాలకు వెళ్ళినప్పుడు దుస్తుల విషయంలో జాగ్రత్తపడతారు!
కాని దేవుని మందిరమునకు ఏ బట్టలు వేసుకొన్నా, ఫరవాలేదు అనుకొంటారు!

★ ఇతరుల ముందు ప్రశంసలు వినడానికి, పొందుకోవడానికి ముందు ఉంటారు/ ఇష్టపడతారు!
కాని ఇతరుల ముందు దేవునిని స్తుతించడానికి సిద్ధపడరు!

★ మనుష్యులు ఏమనుకొంటున్నారో అని ఆలోచిస్తుంటారు!
కాని దేవునిని దుఃఖపరుస్తున్నానేమో అని ఆలోచించరు!

– సెలెక్టెడ్

# సమస్యలు జయించుట ఎలా?

జీవిత యాత్రలో అనేక ఆటంకాలు ఎదురౌతాయి! కుటుంబ, ఆర్థిక, ఆరోగ్య సమస్యలు ఎదురౌతున్నప్పుడు ఆత్మలో ఎదగలేము! అయితే దేవుని వాక్యము మనము ఎదుర్కొనే అనేక రకములైన సమస్యలకు రకరకాల విధాలుగా వాటి నుండి విడుదల పొందే మార్గములను తెలియజేయుచున్నది.

దేవుని మందిరమును కట్టుటకు జెరుబ్బాబెలు పూనుకొన్నప్పుడు అనేక రకములైన ఆటంకములు ఎదురైనవి. అట్టి సమయములో దేవుడు "శక్తి చేతనైనను బలము చేతనైనను కాక నా ఆత్మ చేతనే ఇది జరుగునని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చెను. గొప్ప పర్వతమా, జెరుబ్బాబెలును అడ్డగించుటకు నీవు ఏమాత్రపు దానవు? నీవు చదును భూమి వగుదువు; – కృప కలుగును గాక, కృప కలుగును గాక అని జనులు కేకలు వేయగా అతడు పైరాయి తీసికొని పెట్టించును" (జెకర్యా 4:6–7) అన్న వాగ్దానము యివ్వగా; 'కృప కలుగును గాక, కృప కలుగును గాక' అన్న జయధ్వనులతో జనులు కేకలు వేసినప్పుడు తిరిగి ఆ పనిని కొనసాగించ గలిగెను.

సాధారణంగా సమస్యలు అనేవి మనకు పర్వతాల్లాగా కనిపిస్తుంటాయి. మనం వీటిని ఎలా అధిగమించగలం, వీటిని ఎలా దాటిపోగలము అన్న ప్రశ్నలు మనలను చుట్టుముడతాయి! అవిశ్వాసము, పిరికితనము చోటుచేసుకొన్నప్పుడు మన సమస్యలను చూచి మనము కృంగిపోతుంటాము, చేతకానివారి వలె చేతు లెత్తేస్తాము! శ్రమ దినమున నీవు కృంగిన యెడల నీవు చేతకాని వాడవౌదువు అని దేవుని వాక్యము హెచ్చరించుచున్నది. దేవుడు మనలను ఎన్నుకొన్నది; బలహీనుల మైన మన ద్వారా బలమైన తన కార్యములు జరిగించుట కొరకే!

అవును, మనకు బలహీనతలు ఎన్నున్నను వాటి కంటె మించిన దేవుని కృప మనకు ఉన్నది. గనుక పర్వతముల వంటి సమస్యలు నీ ముందుకు వచ్చినప్పుడు 'కృప కలుగును గాక, కృప కలుగును గాక' అని విశ్వాసంతో నీవు అన్నప్పుడు నీ ముందున్న పర్వతం తొలగిపోతుంది. నీ కుటుంబములో 'కృప కలుగును గాక, కృప కలుగును గాక' అని పలుకు; అప్పుడు నీ సమస్యలు తీరిపోతాయి!

నీవు దేవుని వాక్యమునందు, ఆయన యిచ్చు వాగ్దానముల యందు విశ్వాస ముంచు! ఎందుకంటే నీతిమంతుడు విశ్వాస మూలముగా జీవించునని దేవుని వాక్యము చెప్పుచున్నది (హబక్కూకు 2:4). మనము విశ్వాసముతో ప్రభువువైపు

చూస్తున్నప్పుడు, ఆయన మన విశ్వాసమును ఘనపరచును, 'నీ విశ్వాసము గొప్పది' అని సాక్ష్యమిచ్చును (మత్తయి 15:25). ఆత్మ ఫలములో ఒకటైన ఈ విశ్వాసమును మనము కలిగియున్నప్పుడు, మన ఆధ్యాత్మిక జీవితము ఫలభరితమైనదిగా, తగిన కాలమున ఫలము నిచ్చునదిగా ఉండును. నమ్ముట మన పనియైతే, నమ్మినదానిని నెరవేర్చుట దేవుని పనియై యున్నది (మార్కు 9:23-29).

విశ్వాసముంచిన మనం ప్రార్థించాలి, మొఱ్ఱపెట్టాలి! ఎందుకంటే "నా నామమున మీరు నన్నేమి అడిగినను నేను చేతును" అని ప్రభువు సెలవిచ్చి యున్నాడు (యోహాను 14:14). చాలామంది ఈ దినాల్లో మాకు దేవుడంటే విశ్వాసముందండి అని అంటారు, దేవుడు శక్తి గలిగినవాడు అని కూడా అంటారు గాని ప్రార్థన మాత్రము చేయరు. ఒకవేళ చేసినా పొడి పొడి మాటలతో, అలవాటుగా చేసే ప్రార్థనలే గాని; భారముతో ప్రార్థించరు. మనం ప్రార్థించునప్పుడు ఆసక్తి కలిగి, తీవ్రతతో ప్రార్థించాలని; పరిశుద్ధాత్మలో ప్రార్థించాలని (ఎఫెసీ 6:18) దేవుని వాక్యము చెప్పుచున్నది. అంతేగాక, ప్రార్థనలో పట్టుదల కలిగియుండు! అలా ఉన్నప్పుడు మనం కృప, విశ్వాసంల ద్వారా యెడతెగని ప్రార్థన చేయగలుగుతాము!

కాబట్టి మన జీవితములలో అడ్డు వచ్చే పర్వతములను 'కృప కలుగును గాక కృప కలుగును గాక' అని అంటూ తొలగించుకోవాలి! ఆత్మీయంగా కృపతో, విశ్వాసముతో జీవించాలి! అప్పుడు మన ప్రార్థనలో శక్తి, అధికారము ఉంటాయి. గనుక సమస్యలను మనం యేసు నామంలో విడిచిపో అని గద్దించగలము!

విశ్వాసంతో నడిచినప్పుడు, నీకున్న భయాన్ని జయిస్తావు! దేనిని గూర్చియు చింతించక అన్నిటిని మరచిపో, అన్నిటిని ఎదుర్కొని నిలబడు! రకరకాల సమస్యలు, రకరకాల మనుష్యులకు వస్తాయి! కాని దేవుడు పిరికితనము గల ఆత్మను మనకు యివ్వలేదు (I తిమోతి 1:7). విశ్వాసముతో జీవిస్తున్నప్పుడు, ధైర్యంతో జీవించ గలవు! దేవుడు మన పక్షమున నుండగా మనకు విరోధి యెవడు? (రోమా 8:33). సమస్యలు చూసి పారిపోవద్దు! ధైర్యంతో ఎదుర్కోవాలి!

దావీదు సింహాన్ని, గొల్యాతును ఎదుర్కొన్నాడు. నా దేవుడు గొప్పవాడని దేవుని వైపు చూసాడు గాని; సింహాన్ని గాని, గొల్యాతును గాని చూడలేదు. దేవుని యందు విశ్వాసముంచు, నీ సమస్య ఎంత పెద్దదైనా భయపడకు! యేసువైపు చూడు. యేసు నామమున తప్ప మరి ఏ నామమున మనకు రక్షణ లేదు (అపొ.కార్య. 4:12). ఆయన నామము అన్ని నామముల కన్న పైనున్న నామం (ఫిలిప్పీ 2:9-11). గనుక యేసు వైపు చూడు! నీ సమస్య కొండంత పెద్దదిగా కనిపించినా, ఆవగింజంత విశ్వాసముతో నీవు దానిని కదిలించగలవు!

– శ్రీమతి సులోచన పాల్

సేవకులకు :

# పాప క్షమాపణ పొందగోరువారికి తెలియజేయువలసినవి!

- మన ప్రభువైన యేసుక్రీస్తు మన పాపములను మోసుకొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల యని, మన పాపముల కొరకై ప్రాయశ్చిత్తముగా సిలువలో మరణించెనని తెలియజేయాలి!
- యేసుక్రీస్తు మరణమును, నరక శ్రమలను జయించి, పునరుత్థానుడై లేచెనని; ఎంత పాపినైనా క్షమించడానికి, ఎలాంటి పాపమునైనా కడగడానికి ఆయన సమర్థుడని తెలియజేయాలి!
- యేసుక్రీస్తునందు విశ్వాసముంచుట ద్వారా, పాపములను ఒప్పుకొని విడిచి పెట్టుట ద్వారా పాప క్షమాపణ, మోక్షప్రాప్తి కలుగునని తెలియజేయాలి!
- యేసుక్రీస్తును బహిరంగముగా ఒప్పుకొని, ఆయనకు సాక్షిగా జీవించాలని తెలియజేయాలి!
- యేసుక్రీస్తునందు విశ్వాసముంచుట ద్వారా శరీర, ఆర్థిక, ఆధ్యాత్మిక ఆశీర్వాద ములు కలుగునని తెలియజేయాలి!
- ఈ లోకములో మనము యేసుక్రీస్తు కొరకు జీవించుటకు ప్రార్థన, బైబిలు పఠనము, దేవుని బిడ్డల సహవాసము అత్యవసరమని తెలియజేయాలి!
- 'నేను దేవుని దృష్టిలో పాపిని, క్రీస్తు ద్వారానే పాప క్షమాపణ ఉన్నదని' తెలుసుకొనే టట్లు చేయాలి!
- పాపము యొక్క భయంకరత్వమును, క్రీస్తు యిచ్చు విడుదలను తెలియజేయాలి!
- అవిశ్వాసము వలన మేలు దొరకదని, విశ్వసించుట ద్వారానే రక్షణ కలుగునని తెలియజేయాలి!
- యేసుక్రీస్తు యిచ్చే రక్షణను నిర్లక్ష్యం చేస్తే శిక్ష ఉందని, నరకం తప్పదని తెలియ జేయాలి!
- దేవుని అద్భుత ప్రేమను, ఆయన ఆశ్చర్య కార్యములను తెలియజేయాలి!
- ఈ లోకము శాశ్వతమైనది కాదని, శాశ్వతమైనది పరలోకమని తెలియజేయాలి!
- నమ్మి బాప్తిస్మము పొందువాడు రక్షించబడునని తెలియజేయాలి!
- యేసు నామములో తప్ప మరొక నామములో పాప క్షమాపణ లేదని తెలియ జేయాలి!
- పరలోకానికి యేసు ప్రభువే మార్గము అని తెలియజేయాలి! **– యస్. జయపాల్**

# ఇరుకు మార్గము - విశాల మార్గము

**"ఇరుకు ద్వారమున ప్రవేశించుడి; నాశనమునకు పోవు ద్వారము వెడల్పును, ఆ దారి విశాలమునై యున్నది, దాని ద్వారా ప్రవేశించువారు అనేకులు. జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది, దాని కనుగొనువారు కొందరే".** (మత్తయి 7:13,14)

ఒకసారి ఒకడు–ప్రభువా, రక్షణ పొందువారు కొద్దిమందేనా? అని ప్రభువును అడుగగా, "ఇరుకు ద్వారమున ప్రవేశింప పోరాడుడి, అనేకులు ప్రవేశింపజూతురు గాని, వారి వలన కాదనెను" (లూకా 13:23,24).

మన ఆది పితరుడైన ఆదాము పాపము వలన మరణము చోటు చేసుకొనెను. అప్పటి నుండి మనుష్యులందరూ పాపులై, మరణ మార్గములో తండోపతండములుగా ప్రయాణం చేసి, పాతాళములో పడిపోవుచున్నారు. ఈ లోకాధికారియైన సాతాను ఈ లోక సంపదలతో, పాపభోగాలతో మనుష్యులను మత్తులనుగా చేసి, విశాల మార్గములో నడిపిస్తున్నాడు. ఈ లోకములో జన్మించిన ప్రతి వ్యక్తి పాపానికి లోబడి, తనంతట తానే క్రిందకు జారుకొంటూ, పాతాళము వైపు పరుగెత్తుచున్నాడు. పట్టణాలలోని మురికి నీరంతా సముద్రము వైపు పయనించుచున్నట్లు; పాపులందరూ ఒక ప్రవాహంగా, పాతాళమును చేరుకొంటున్నారు.

అయితే దేవుడు తన అనంత జ్ఞానము చేత పాపములో పడి, పాతాళములోనికి తండోపతండములుగా జారిపోతున్న మానవులను పరలోకం వైపు మళ్ళించి, నడపించడానికి ఆశ కలిగి, ఓ మార్గాన్ని సిద్ధపరచాడు. ఆ మార్గం క్రీస్తే! "నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" (యోహాను 14:6) అని ప్రభువు చెప్పెను. అయితే ఈ మార్గములో ప్రవేశించ గోరువాడు యేసుప్రభువు నందు విశ్వాసముంచాలి, తన్ను తాను త్యజించుకోవాలి! "ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల తన్ను తాను ఉపేక్షించుకొని, ప్రతి దినము తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపవలెను" (లూకా 9:23) అని ప్రభువు చెప్పెను.

ఈ ద్వారము ఇరుకును, ఈ మార్గము సంకుచితమునై యున్నది. అయితే దీనిని కనుగొనువారు ధన్యులు. శరీర మనస్సును, స్వార్థాన్ని విడిచిపెట్టి; లోకాన్ని, లోకాశలను ద్వేషించగలిగినవాడే ఈ మార్గములో ప్రవేశిస్తాడు. "ప్రభువు నామమును ఒప్పుకొను ప్రతివాడును దుర్నీతి నుండి తొలగిపోవలెను" (II తిమోతి 2:19) అని వాక్యము చెప్పుచున్నది. ఈ మార్గములో ప్రవేశించుట అట్టహాసంగా, ఆర్భాటంగా ఉండదు. తన్ను తాను తగ్గించుకొని, సమర్పించుకోగలిగినవాడు మాత్రమే ఇరుకు

ద్వారములో ప్రవేశించగలడు. ఇది సిలువ మార్గము; నిందలను, శ్రమలను భరిస్తూ ముందుకు సాగే మార్గము! ఈ ఇరుకు ద్వారములో ప్రవేశించడానికి పోరాడాలి, ప్రయాసపడాలి!

అయితే యేసునందు విశ్వాసముంచి, ఈ మార్గములో నడుచువారికి ప్రభువు ఇరుకులో విశాలతను కలుగజేయును; వారి యెదుట మార్గమును సరాళము చేయును. ఈ సంకుచితమైన మార్గములో సాగువాడు నీటి ప్రవాహానికి ఎదురీదే బ్రతికిన చేప వలె ముందుకు సాగాలి గాని, నీటి ప్రవాహంతో కొట్టుకొనిపోయే చచ్చిన చేప వలె ఉండకూడదు. ఈ లోకంలోని ప్రజలందరూ అపరాధముల చేతను, దోషముల చేతను చచ్చినవారై; లోకాశలలో పడి, పాతాళము వైపు కొట్టుకొని పోవుచున్నారు. "అందుచేతనే పాతాళము గొప్ప ఆశ పెట్టుకొని అపరిమితముగా తన నోరు తెరచుచున్నది. వారిలో ఘనులును సామాన్యులును ఘోషచేయువారును హర్షించువారును పడిపోవుదురు" (యెషయా 5:14) అని బైబిలు చెప్పుచున్నది.

ఈ లోకంలో అనేకులు ఈ లోక పోకడను బట్టి, లోక మర్యాదలను అనుసరించి, లోక యిచ్ఛలకు లోబడి విశాల మార్గములో కొట్టుకొనిపోవుచున్నారు. అందరూ సినిమాలు చూస్తున్నారు, చూస్తే తప్పేముంది? అందరూ లంచాలు తీసుకొంటున్నారు, నేను మాత్రం ఎందుకు తీసుకొనకూడదు? అబద్ధాలు ఆడకుండా, నీతిగా న్యాయముగా జీవించడం ఎలా కుదురుతుంది? అంటూ అందరినీ చూస్తూ అనేకులు  పాడైపోవుచున్నారు.

అయితే 'ఇలా పాడై పతనమైపోతున్న మనుష్యుల మధ్య నేను పరిశుద్ధముగా జీవించాలి, దేవునికి లోబడాలి; అందరిలా నేను అబద్ధమాడను, లంచం పుచ్చుకొనను, అపవిత్రమైన వాటిని చూడను' అని నిర్ణయించుకొని; ప్రార్థనలో పోరాడుచు, పవిత్ర జీవితమును కాపాడుకొనేందుకు ఆశించువాడే యేసును వెంబడించువాడు, పరలోకమును  చేరగలిగినవాడు.

నోవహు దినములలో లోకమంతయు చెడిపోయి, సమస్త శరీరులు తమ మార్గములను చెరిపివేసుకొని, దేవుని భయము విడిచి; తినుచు, త్రాగుచు తమ ఇష్టానుసారంగా జీవించుచుండిరి (ఆది 6:12). అయితే "నోవహు నీతిపరుడును తన తరములో నిందారహితుడునై యుండెను. నోవహు దేవునితో కూడ నడచిన వాడు" (ఆది 6:9). గనుకనే దేవునియందు భయభక్తులు కలిగిన నోవహు ఇరుకు మార్గములో ప్రవేశించుటకు పోరాడెను. తన భార్యను, ముగ్గురు కుమారులను, ముగ్గురు కోడండ్రను రక్షణ ఓడలోనికి నడిపించెను. అందువలన సర్వ ప్రపంచము నాశనమైనను, అతని కుటుంబము రక్షింపబడెను (హెబ్రీ 11:7; I పేతురు 3:20).

నెబుకద్నెజరు పెట్టిన నిలువెత్తు విగ్రహమునకు దేశములోని జనులందరును సాగిలపడినప్పటికి; 'నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు, దేని రూపము

నైనను చేసికొని దానికి సాగిలపడకూడదు' (నిర్గమ 20:3,4) అన్న దేవుని మార్గమును వెంబడించగోరిన షద్రకు, మేషాకు, అబేద్నెగోలు ఆ విగ్రహమునకు నమస్కరింప మనిరి. "మేము సేవించుచున్న దేవుడు మండుచున్న వేడిమిగల యీ అగ్ని గుండములో నుండి మమ్మును తప్పించి రక్షించుటకు సమర్థుడు; మరియు నీ వశమున పడకుండ ఆయన మమ్మును రక్షించును; ఒకవేళ ఆయన రక్షింపకపోయినను రాజా, నీ దేవతలను మేము పూజింపమనియు, నీవు నిలువబెట్టించిన బంగారు ప్రతిమకు నమస్కరింపమనియు తెలిసికొనుము" (దానియేలు 3:17,18) అనిరి.

అందుకు ఆగ్రహము చెందిన రాజు వారిని అగ్నిగుండములో పడవేసినప్పటికి; వారు ప్రాణములను పోగొట్టుకొనలేదు గాని, దేవుడు వారికి తోడైయుండినందున వారి శరీరములకు అగ్ని ఏ హాని చేయకుండుటయు, వారి తల వెండ్రుకలలో ఒకటియు కాలిపోకుండుటయు, అగ్ని వాసనయైనను వారి దేహములకు తగుల కుండుటయు చూచినవారు 'వారి దేవుడే నిజమైన దేవుడని' విశ్వసించగలిగిరి. "తన ప్రాణమును రక్షించుకొనగోరువాడు దానిని పోగొట్టుకొనును. నా నిమిత్తమును సువార్త నిమిత్తమును తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దాని రక్షించుకొనును" (మార్కు 8:35) అని ప్రభువు చెప్పెను.

విశాల మార్గము పోను పోను ఇరుకై అడుగు లేని నరకములో పడవేయును. అయితే యేసయ్య ఇరుకు మార్గం పోను పోను విశాలమై; క్షేమకరమైన, ఆకలి దప్పిక లేని; సంతోష సమాధానములకు నిలయమైన పరలోక పట్టణమునకు చేర్చును. గనుక జీవానికి పోయే ఇరుకు మార్గం కావాలో, మరణానికి పోయే విశాల మార్గం కావాలో నీవే కోరుకో! కోరుకొనే స్వేచ్ఛను ప్రభువు మనకు ఇచ్చాడు. ఆయన బలవంతముగా మనలను పరలోకమునకు తీసుకొని వెళ్ళడు గాని; 'ఇదిగో పరలోకము, ఇదిగో నరకము; ఏది కావలెనో కోరుకో అంటున్నాడు. 'చూడుడి, నేడు నేను మీ యెదుట దీవెనను, శాపమును పెట్టుచున్నాను. నా మాట వినిన యెడల ఆశీర్వాదము, లేనియెడల శాపము అని ప్రభువు చెప్పుచున్నాడు (ద్వితీయో 11:26-28). నేడు జీవమును, మరణమును; ఆశీర్వాదమును, శాపమును నీ యెదుట ఉంచి భూమ్యాకాశములను మీ మీద సాక్షులుగా పిలుచుచున్నాను (ద్వితీయో 30:19). ఏది కావలెనో కోరుకొనుము!

యేసు ప్రభువు జీవము-సాతాను మరణము; యేసయ్య మార్గము ఆశీర్వాదము -సాతాను మార్గము శాపము. యేసయ్య మార్గము సత్యమైనది, పరిశుద్ధమైనది; నిత్య రక్షణ నిచ్చి శాశ్వతమైన, సంతోషకరమైన జీవితమునకు నడిపించునది. సాతాను మార్గము ఇష్టానుసారంగా జీవించేది; ఇచ్ఛలతో, అల్పకాల పాపభోగాలతో నిండినది. అయితే చివరికి దుఃఖానికి, నిత్య నాశనానికి నడిపించేది! ఏది కావాలో కోరుకో!

– యన్. జయపాల్

వనితలకు :

# కృప గల స్త్రీ

నెహెమ్యా గ్రంథము 1వ అధ్యాయము 4 నుండి 11 వరకు గల వచనములలో నెహెమ్యా చేసిన ప్రార్థనను మనము చూడగలము! ఈ ప్రార్థనలో మూడు రకములైన ముఖ్యమైన ప్రార్థనలు ఉన్నాయి. అవి మధ్యవర్తిత్వపు ప్రార్థన, యథార్థ ప్రార్థన, ఉపవాస ప్రార్థన! ఇటువంటి ప్రార్థనలను దేవుడు అంగీకరించి, తన జవాబులిచ్చును మరియు అద్భుతములు చేయును.

యెరూషలేము ప్రాకారము కాల్చబడినదని తెలిసిన నెహెమ్యా భారముతో ప్రార్థించాడు. ఏ వ్యక్తియైతే యెరూషలేము ప్రాకారముల కొరకు కన్నీరు కార్చి ప్రార్థించాడో, అతని చేతనే యెరూషలేము ప్రాకారములను దేవుడు తిరిగి కట్టించాడు. పశ్చాత్తాపముతో, విరిగి నలిగిన హృదయముతో మనం ప్రార్థించినప్పుడు దేవుడు కోల్పోయిన వాటిని తిరిగి అనుగ్రహిస్తాడు (యోవేలు 2:23,27). హృదయంలో కదిలించబడి చేసే ప్రార్థనలకు దేవుని నుండి మేలైన, శ్రేష్ఠమైన అద్భుతాలు చూడగలవు!

ప్రభువు హృదయాన్ని కదిలించేది ప్రార్థన! అబ్రాహాము లోతు కొరకు ప్రార్థించాడు. ఇటువంటి ప్రార్థనలను మధ్యవర్తిత్వపు ప్రార్థన లేక విజ్ఞాపన ప్రార్థన అంటారు. "సంరక్షకుడు లేకపోవుట ఆయన చూచెను మధ్యవర్తి లేకుండుట చూచి ఆశ్చర్యపడెను" (యెషయా 59:16) అని దేవుడు ఎంతో వేదన చెందుటను మనము చూడగలము! మోషే అనేకసార్లు ప్రజల పక్షాన దేవుని సన్నిధిలో నిలబడ్డాడు. వారు దేవుని విసిగించి, వేదనకు గురి చేసినప్పుడు; 'ఈ ప్రజలను నశింపజేస్తాను' అని దేవుడు అంటే, మోషే అడ్డుపడి ఏ మాత్రము ఒప్పుకోలేదు. మధ్యవర్తిత్వపు ప్రార్థన ఎంతో ముఖ్యమైనది! నీవు నీ కుటుంబము కొరకు, నీ జనుల కొరకు ఈలాగున ప్రార్థిస్తున్నావా? నీవున్న సంఘము కొరకు, జరుగుతున్న పరిచర్యల కొరకు ప్రార్థిస్తున్నావా? లేనట్లైతే నేటి నుండైనా ప్రార్థించుట ప్రారంభించు!

"యథార్థవంతుల ప్రార్థన ఆయనకు ఆనందకరము" (సామెతలు 15:8) అని దేవుని వాక్యము తెలియజేయుచున్నది. పాపముతో నిండిన హృదయముతో చేసే ప్రార్థన దేవునికి అసహ్యము (యెషయా 1:11-17) అయితే పాపమును ఒప్పుకొనుచు చేసే యథార్థ ప్రార్థన ఆయనకు ఆనందకరము! నెహెమ్యా తన పాపమును, తన ప్రజల పాపమును ఒప్పుకొనుచు ప్రార్థించినప్పుడు దేవుడు ఆ ప్రార్థనను ఆలకించి జవాబిచ్చుటను చూస్తున్నాము! ఆలాగే దానియేలు తన దేశము

కొరకు ప్రార్థించి నప్పుడు తన పాపమును, తన ప్రజల పాపమును ఒప్పుకొనెను. ఈ దినాల్లో అనేక కుటుంబాల్లో దేవుని కార్యములు జరుగకపోవుటకు కారణం, వారు తమ పాపమును, తమ ఇంటివారి దోషములను ఒప్పుకొని ప్రార్థన చేయనందుననే! గనుక ఈ వర్తమానమును చదువుచున్న నీవు ఇకనుండైనా ఈలాగున ప్రార్థన చేయుట అలవరచుకో!

ఉపవాసముండి ప్రార్థించుట అనేది కూడా ఎంతో విలువైనది, మరెంతో శ్రేష్ఠమైనది. మనము ఉపవాసమున్నప్పుడు దేవునితో మాట్లాడాలి! ఈ లోకంలోని విషయాలన్నింటిని ప్రక్కన పెట్టి, కృతజ్ఞతా స్తుతులతో ప్రార్థిస్తే ఎంతో కృపను పొందుకోగలవు! ఉపవాస ప్రార్థనతో యున్నప్పుడు నీ ఆధ్యాత్మిక స్థితిలో పక్షిరాజు వలె పైకి ఎగురుతావు, ఎక్కలేనంత ఎత్తైన కొండ పైకి ఎక్కగలవు!

నీ జీవితం ఎంత విలువైనదో నీవు తెలుసుకోవాలి! హృదయాలంకారం దేవుని ఆకర్షిస్తుంది. దానిని గ్రహించుకొని దేవుని సంతోషపరచాలి! పరిశుద్ధాత్మ శక్తితో నింపబడినప్పుడు ఎంతో శక్తివంతంగా జీవించగలవు! దేవుని ప్రేమించేవారికి సమస్తము సమకూడి జరుగుతుంది.

నీ ప్రార్థన ద్వారా నీ కుటుంబము కట్టబడుతుంది (నిర్గమ 8:12,13). దేవుని కోపము రగులుకొన్నప్పుడు ప్రార్థనా యోధుడైన మోషే నిలువబడినట్లుగా, దుష్టుడు నీ కుటుంబము మీద దాడి చేసినప్పుడు నీవును నిలువబడి ప్రార్థించు! అప్పుడు ప్రార్థన ద్వారా అపవాదిని జయించగలవు!

మనము ప్రార్థిస్తున్నప్పుడు దేవుని సన్నిధిలో ఉన్నామని గుర్తించాలి! ఏలీయా ఎవని సన్నిధిలో నిలబడియున్నానో అంటున్నాడు. గబ్రియేలు ఎవని సన్నిధిలో నిలబడియున్నానో అంటున్నాడు. దేవుని సన్నిధిలో ఎదురుగా నిలబడ్డాడు. ప్రార్థన కష్టతరమైనదిగా అనిపించినప్పటికీ అది బహు శ్రేష్ఠమైనది! ఆసక్తితో, అత్యాసక్తితో ప్రార్థిస్తే నిన్ను దాటి ఏ చీకటి శక్తులు రాలేవు. నీవు చేసే ప్రార్థన ద్వారా దేవుడు నీ కుటుంబము చుట్టూ కంచె వేస్తాడు (సంఖ్యా 11:1,2). క్రీస్తును ధరించుకొన్న నీవు ప్రార్థనను అలక్ష్యము చేయవద్దు! ప్రార్థిస్తున్నంతసేపు సాతాను తంత్రాలు పనిచేయలేవు. ఎన్నో కీడులను తప్పించుకోగలవు!

ప్రార్థనలో గొప్ప కదలికలు, గొప్ప ఉజ్జీవము, గొప్ప విడుదల చూడగలవు! గనుక ఆసక్తితో, అత్యాసక్తితో ప్రార్థించు! నీ కుటుంబము కూలిన స్థితిలో ఉన్నట్లున్నా, నీ కుటుంబములో దుష్టుని కార్యములు అధికమగుచున్నా నీవు చేసే ప్రార్థనతో నీ కుటుంబాన్ని మార్చుకోగలవు! క్రీస్తులో నీవు బలవంతురాలివి! ఆయన కృపలో జీవించు!

– శ్రీమతి సులోచన పాల్

# అర్థాలు తెలుసుకొందాం!

(గత సంచిక తరువాయి...)

| | | | | |
|---|---|---|---|---|
| 366. | ఇషీ | = | నా సహాయకుడు, ఆదరణ కర్త | (I దిన 2:31; 4:20) |
| 367. | ఇష్వీ | = | నన్ను నీతిమంతునిగా తీర్చును | (ఆది 46:17) |
| 368. | ఇష్షీయా | = | యెహోవా మరచిపోవును, అప్పిచ్చువాడు | (ఎజ్రా 10:31) |
| 369. | ఇష్మెరై | = | యెహోవా కాపాడువాడు | (I దిన 8:18) |
| 370. | ఇషోదు | = | ఘనుడు, ప్రకాశము గలవాడు | (I దిన 7:18) |
| 371. | ఇష్బోషెతు | = | సిగ్గుపడవలసినవాడు | (II సమూయేలు 2:8-10) |
| 372. | ఇస్కరియోతు | = | కెరియోతు అను గ్రామ కాపురస్థుడు | (మత్తయి 10:4) |
| 373. | ఇస్మక్యాహు | = | యెహోవా ఉద్ధరించువాడు | (II దిన 31:13) |
| 374. | ఇస్కా | = | వివేచించునది, యెహోవా అభిషేకించును | (ఆది 11:29) |
| 375. | ఇస్సాకు | = | అతడు నవ్వును | (ఆది 21:3; లేవీయ 26:42) |
| 376. | ఇస్హారు | = | మంచినూనె, ప్రకాశమానమైనది | (సంఖ్యా 3:19) |
| 377. | ఈకాబోదు | = | మహిమ పోయెను, ప్రభావమెక్కడిది? | (I సమూ 4:21; 14:3) |
| 378. | ఈకొనియ | = | విగ్రహమును పోలినది | (అపొ. కార్య. 13:51) |
| 379. | ఈజరు | = | సహాయము | (సంఖ్యా 26:29-32) |
| 380. | ఈతామారు | = | ఈత చెట్ల తీరము | (నిర్గమ 6:23; ఎజ్రా 8:2) |
| 381. | ఈతీయేలు | = | దేవుడు నాకు తోడైయున్నాడు | (నెహె 11:7; సామె 30:1) |
| 382. | ఈయ్యే | = | కుప్పలు, పాడు శేషములు | (యెహోషువ 15:20-32) |
| 383. | ఈయ్యే అబారీము | = | అవతలి ప్రదేశములోని పాడు శేషములు | (సంఖ్యా 21:11) |
| 384. | ఈయోను | = | పాడు శేషములు, కుప్ప | (I రాజు 15:20; II రాజు 15:29) |
| 385. | ఈరా | = | మెలకువగా నుండుట, కావలివాడు | (II సమూ 20:24) |
| 386. | ఈరాము | = | మెలకువ | (ఆది 36:43; I దిన 1:54) |
| 387. | ఈరీ | = | నా పట్టణము | (I దిన 7:7) |
| 388. | ఈరు | = | మెలకువ, కావలివాడు | (I దిన 7:12) |
| 389. | ఈరూ | = | మేలుకొని యుండుట, కావలి యుండుట | (I దిన 4:15) |
| 390. | ఈలై | = | ఉన్నతుడు | (I దిన 11:29) |
| 391. | ఉక్కాలు | = | నేను బలము గలవాడను, గెలిచెదను | (సామె 30:1) |
| 392. | ఉజ్జా | = | బలము, త్రాణ | (II సమూ 6:3; II రాజులు 21:18) |
| 393. | ఉజ్జియా | = | యెహోవాయే నా బలము | (II రాజు 15:13; I దిన 11:44) |
| 394. | ఉజ్జీ | = | నా బలము | (I దిన 6:5; నెహెమ్యా 12:19) |
| 395. | ఉజ్జీయేలు | = | దేవుడు బలము గలవాడు | (నిర్గమ 6:18; I దిన 25:4) |

**(సశేషం)** - ఎడిటర్

# మీరు బైబిలు చదువుచున్నారా?

సాధారణమైన వేగముతో, బిగ్గరగా బైబిలును చదవాలంటే 70 గంటల 40 నిమిషములు పడుతుంది. పాత నిబంధన 52 గంటలలోను, క్రొత్త నిబంధన 18 గంటల 40 నిమిషములలోను చదివి ముగించవచ్చును.

క్రొత్త నిబంధనలోని గ్రంథములోని పుస్తకములను చదువుటకు ఇంచుమించు పట్టు సమయము :

| పుస్తకము | నిమిషములు | పుస్తకము | నిమిషములు |
|---|---|---|---|
| మత్తయి సువార్త | 145 | తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక | 15 |
| మార్కు సువార్త | 90 | తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక | 10.5 |
| లూకా సువార్త | 155 | తీతుకు వ్రాసిన పత్రిక | 7 |
| యోహాను సువార్త | 121 | ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక | 2.5 |
| అపొస్తలుల కార్యములు | 135 | హెబ్రీయులకు వ్రాసిన పత్రిక | 48 |
| రోమీయులకు వ్రాసిన పత్రిక | 61.5 | యాకోబు వ్రాసిన పత్రిక | 16 |
| కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక | 56.5 | పేతురు వ్రాసిన మొదటి పత్రిక | 17.5 |
| కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక | 36.5 | పేతురు వ్రాసిన రెండవ పత్రిక | 11 |
| గలతీయులకు వ్రాసిన పత్రిక | 19 | యోహాను వ్రాసిన మొదటి పత్రిక | 16.5 |
| ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక | 19 | యోహాను వ్రాసిన రెండవ పత్రిక | 2 |
| ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక | 14 | యోహాను వ్రాసిన మూడవ పత్రిక | 2 |
| కొలొస్సయులకు వ్రాసిన పత్రిక | 13 | యూదా వ్రాసిన పత్రిక | 5 |
| థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక | 11 | ప్రకటన గ్రంథము | 82.5 |
| థెస్సలొనీకయులకు వ్రాసిన రెండవ పత్రిక | 6.5 | | |
| | | **మొత్తము సమయము** | **1118.5** |

సమయము సద్వినియోగపరచుకొనుమని దేవుని వాక్యము చెప్పుచున్నది (ఎఫెసీ 5:15-16). అయితే అనేకులు తమకిచ్చిన 24 గంటలను తిండికి, నిద్రకి, వ్యర్థమైన పనులకు, పాపమునకు వృథాపరచుకొనుచున్నారు. దేవుని వాక్యము చదువుటకు, ప్రార్థించుటకు సమయము లేదని సాకులు చెప్పుచున్నారు. ఇంచుమించు 70 గంటలలో బైబిలు ఒకసారి చదివి ముగించగలిగితే, 70 సంవత్సరముల నీ వయస్సులో ఎన్నిసార్లు నీవు బైబిలు చదివి ముగించాల్సి ఉన్నది? ప్రతి రోజు 37 నిమిషములు నీవు బైబిలు చదువుటకు కేటాయిస్తే, ఒక నెలలో క్రొత్త నిబంధన అంతా చదివి ముగించవచ్చు! ఇంచుమించు ఒక గంట ప్రతి రోజు నీవు బైబిలు చదివితే, పాత నిబంధనను 55 రోజుల లోను, క్రొత్త నిబంధనను 15 రోజులలోను చదివి ముగించవచ్చును. లేక కనీసము ప్రతి దినము 3 అధ్యాయములు, ఆదివారము 5 అధ్యాయములు చదువగలిగితే ఒక సంవత్సరం లోపలే బైబిలంతా చదివి ముగించవచ్చును. ఈ రోజు నుండియే బైబిలు చదువుట, ధ్యానించుట, అనుసరించుట ప్రారంభించండి!

– ఎడిటర్

# 16 GB మెమొరీ కార్డ్స్ & పెన్ డ్రైవ్స్

(౬౦ గంటలు ఆడియో వీడియో పాటలు - ప్రసంగములతో నిండినవి!)

★ **సందేశాలు సంగీతాలు - యెరూషలేము**

(75 వర్తమానములు-50 పాటలు; 24 యెరూషలేము ప్రసంగాలు-30 పాటలు)

★ **కల్వరి సునాద గీతములు - కుటుంబమును కట్టు సత్యములు**

(100 పాటలు -50 వర్తమానములు; శ్రేష్ఠమైన 35 వీడియో వర్తమానములు)

★ **మీకు తెలుసా? - మన్నా మనకు**

(30 నిజ సంఘటనలు - 30 చారిత్రాత్మక విషయాలు; అనుదిన వర్తమానాలు)

**ఒక్కొక్కదాని వెల రూ. 1,000/-. అయితే తగ్గింపు ధరగా రూ. 700/- లకే పొందగలరు! కావలసినవారు రుసుముతో పాటు రిజిస్టర్డ్ పోస్ట్ ఖర్చు రూ. 50/- కలిపి పంపండి!**

**మరియు పాటల ప్రసంగముల CDలు కూడా లభ్యమగును. 10 రకముల ఈ CDల మొత్తము వెల రిజిస్టర్డ్ పోస్ట్ ఖర్చుతో సహా రూ. 250/- పంపి, పొందగలరు!**

మరిన్ని వివరములకు సంప్రదించవలసిన నంబర్ – (0) 89 39 39 39 39

## సోషల్ మీడియాలో Dr. Jayapaul ఛానల్ Subscribe చేసారా?

YouTube    facebook    Instagram

**ప్రతిరోజు "మన్నా మనకు"లో శ్రేష్ఠమైన సందేశాలు అందించబడుతున్నాయి! ఆదివారపు ఆరాధనలు మరియు ఆయా స్థలాల్లో జరిగే గెట్-టుగెదర్ మీటింగ్‌ల ప్రత్యక్ష ప్రసారాలలోని దేవుని వాక్యమును చూడవచ్చు!**

**ఇప్పుడే** Dr. Jayapaul **ఛానల్‌ను** Subscribe **చేయండి!**
Like **చేయండి!** Share **చేయండి!**

## విజయవాడలో ప్రతి మంగళవారం గెట్-టుగెదర్

**మధ్యాహ్నం 2:00 గం॥ల నుండి సాయంత్రం 6:00 గం॥ల వరకు; మరియు సాయంత్రం 6:00 గం॥ల నుండి రాత్రి 10:00 గం॥ల వరకు**

విజయవాడ పరిసర ప్రాంతములలో ఉన్నవారందరూ ఈ ఆరాధనలో పాల్గొనవచ్చును! దైవజనులు డా॥ జయపాల్ గారిని కలిసి, ప్రార్థన చేయించుకొనవచ్చును! మరిన్ని వివరములకు +91 9100 100 888 కు ఫోన్ చేయండి!

స్తుతి **సేవా సమాచారములు** ప్రార్థన

'బల్యర్పణ చేత నాతో నిబంధన చేసుకొన్నవారిని సమకూర్చు' (కీర్తన 50:5) అన్న వాగ్దానం ద్వారా 'కల్వరి దర్శనం' కార్యక్రమాల ద్వారా రక్షించబడుతున్న వారిని ఆధ్యాత్మికముగా బలపరచి, స్థిరపరచడానికి; 2016 జూలై 15వ తేదీ నుండి విజయవాడలో ప్రతి మంగళవారం గెట్-టుగెదర్‌లు ప్రారంభించి, గత మూడు సంవత్సరములు కొనసాగించుటకు ప్రభువు కృప నిచ్చెను.

ప్రతి మంగళవారం విజయవాడలో జరిగే గెట్-టుగెదర్‌కు విజయవాడ పరిసర ప్రాంతముల నుండి ఇంచుమించు 70 ఊర్ల నుండి హాజరౌతున్నారు. మోకాళ్ళ ప్రార్థన, దేవుని చిత్తము యెరుగుట, కుటుంబములు కట్టుకొనుట, క్రీస్తు పోలికలో యెదుగుట అనే విషయములను నేర్చుకొంటూ ఆధ్యాత్మికముగా ఎదుగుతున్నారు. గెట్-టుగెదర్‌కు హాజరౌతున్న వారిని ముఖాముఖిగా కలిసి, వ్యక్తిగతముగా ప్రార్థించి, హెచ్చరించి, సలహాలు ఇచ్చు అవకాశము కలుగుచున్నది.

విజయవాడలోనే కాక, మరనేక చోట్ల ఇంచుమించు 100 స్థలములలో - ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ, దుబాయ్, అమెరికా వంటి స్థలములలో కూడా ఈ గెట్-టుగెదర్‌లు జరిపించుటకు ప్రభువు కృప నిచ్చెను. ఈ అంత్య దినములలో విశ్వాసులను స్థిరపరచుట, రాకడ కొరకు సిద్ధపరచుట అన్నది అతి ప్రాముఖ్యమైన విషయంగా ఈ గెట్-టుగెదర్‌లను కొనసాగించుచున్నాము!

ప్రభువు చిత్తమైతే రాబోవు నెలలలో విశాఖపట్నం, రాజమండ్రి, ఆగిరిపల్లి, హనుమాన్ జంక్షన్, రాయచూర్, అనంతపురం, కర్నూలు, గంగావతి, బళ్లారి, బెంగుళూరు, ఢిల్లీ, అమృత్‌సర్, ముంబై, పూణే, కోల్కత్తా మరియు దుబాయ్, సింగపూర్ ప్రాంతములలో గెట్-టుగెదర్స్ ఏర్పాటు చేయుటకు ప్రార్థన చేయుచున్నాము! మీరును ప్రార్థించండి!

**పాస్టర్స్ కాన్ఫరెన్స్, విజయవాడ - 2019 జూలై 15 :** దేవుని మహాకృపను బట్టి 2016లో విజయవాడలో ప్రారంభించిన గెట్-టుగెదర్ మీటింగులు మూడు సంవత్సరముల పరిచర్యను ముగించుకొని నాలుగవ సంవత్సరములో ప్రవేశించినవి! ఈ సందర్భముగా జూలై 15వ తారీఖున ఏర్పాటుచేసిన 'పాస్టర్స్ కాన్ఫరెన్స్'కు అనేకమంది దైవజనులు, దేవుని సేవలో వాడబడుతున్నవారు, దేవుని సేవా పిలుపును కలిగి సేవ చేయుటకు ఆసక్తి కలిగినవారు ఈ కూడికకు హాజరైరి!

'పాస్టరు-అధ్యయనము', 'పాస్టరు-సంఘము', 'పాస్టరు-కుటుంబము', 'పాస్టరు-ఆర్థిక వ్యవస్థ', 'పాస్టరు-డిజిటల్ మీడియా', 'పాస్టరు-అభిషేకము' మరియు 'పాస్టరు-స్వయం క్రమశిక్షణ' అనే ఈ ఏడు అంశములను గూర్చి ధ్యానించితిమి! వచ్చినవారనేకులు మేలు పొందినట్లుగా తెలియజేసారు. ఈ అంత్య దినములలో సేవకులను దేవుడు బహుగా తీర్చిదిద్దాలని, బలముగా వాడుకోవాలని ప్రార్థించండి!

అదే రోజు సాయంత్రం జరిగిన స్తుతి కూడికకు విజయవాడ, పరిసర ప్రాంతముల నుండి అనేకులు తరలి వచ్చారు. గత మూడు సంవత్సరములుగా ఈ గెట్-టుగెదర్‌లకు హాజరౌతున్నవారు, వారు పొందిన మేళ్లను గూర్చి తెలియజేసినప్పుడు దేవుడు ఎంత నమ్మదగినవాడోనని గుర్తించి, ఆయనను స్తుతించితిమి! ఈ పరిచర్య పట్ల దేవుని ప్రణాళికలు నెరవేరునట్లు ప్రార్థించండి!

# కల్వరి దర్శనం టి.వి. కార్యక్రమాలు మీకు ఆశీర్వాదకరంగా ఉన్నాయా?

ప్రతిరోజు ఉదయం 6:30 ని॥లకు మా మూవీస్‌లోను; రాత్రి 7:00 గం॥లకు శుభవార్తలోను, 8:00 గం॥లకు ఆరాధనలోను ప్రసారమగుచున్న కార్యక్రమాలు కొనసాగునట్లు ఈ పరిచర్యల ద్వారా మేలు పొందుచున్న మీరు ప్రార్థించండి! మీ విరాళములు పంపుట ద్వారా ఈ పరిచర్యలో పాలిభాగస్థులవ్వండి!

ప్రతిరోజు హిందీలోను మరియు తమిళం, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీషు భాషలలో వారానికి ఒక కార్యక్రమం ప్రసారమగుచున్నవి! అంతేగాక కన్నడ, పంజాబీ, మరాఠీ, ఉర్దూ, రష్యన్ మొదలైన మరికొన్ని భాషలలో టెలివిజన్ కార్యక్రమాలు త్వరలో ప్రారంభించాలని ప్రార్థిస్తున్నాము!

ఇట్టి భారభరితమైన పరిచర్యలలో మీరు కూడా పాలిభాగస్థులగునట్లు **రూ. 1,000/-** లేక **రూ. 10,000/-** లేక ప్రభువు మిమ్మును ప్రేరేపించిన కొలది మీ విరాళములను, కానుకలను పంపి, దైవాశీస్సులు పొందండి!

M.O. ద్వారా, D.D. ద్వారా, చెక్కు ద్వారా లేక **ఇప్పుడు అందరికీ అందుబాటులోనికి వచ్చిన** Online Transaction **ద్వారా మీ విరాళములు పంపించవచ్చు! మరియు** Google Pay **ద్వారా కూడా పంపించవచ్చు!**

**ONLINE వివరములు :**

**Andhra Bank**

**Name: JAYAPAUL FOUNDATIONS**
**Current A/c No: 207211100000229**
**I.F.S. Code No: ANDB0002072**
**Branch: Kodambakkam, Chennai-24.**

**State Bank of India**

**Name: JAYAPAUL FOUNDATIONS**
**S.B. A/c No: 30699437837**
**I.F.S. Code No: SBIN0001444,**
**Branch: Kodambakkam, Chennai-24.**

**ICICI Bank**

**Name: JAYAPAUL FOUNDATIONS**
**Current A/c No: 021205006901**
**I.F.S. Code No: ICIC0000212**
**Branch: Santhome, Chennai.**

ఇంకా వివరములు కావాలంటే **(0) 89 39 39 39 39** నంబర్‌కు ఫోన్ చేయండి! లేక మీ పేరు, సెల్ నంబర్, విషయము ఈ సెల్ నంబర్‌కు SMS చేయండి!

**Google Pay**

Jayapaul N
+91 95000 01111

**T.V. పరిచర్యకు మీ విరాళములు M.O.లు, D.D.ల ద్వారా పంపుటకు మా చిరునామా :**

**JAYAPAUL FOUNDATIONS,**
**29, NEW COLONY ROAD,**
**VELACHERY, CHENNAI-600042**




CALVARY PREMADHARA (Bi-Monthly) July - August 2019
Registered with Registrar of News Papers India, Under NO: 69868/98